తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

24-06-2026

బుధవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 136

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575


## పద్మ పురస్కారాలతో రాష్ట్రపతి భవన్ కళకళ

- మమ్ముట్టి, విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్
- శిబు సోరెన్‌కు మరణానంతర గౌరవం
- మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌కు పద్మశ్రీ

02



## మెట్రోపై సీఎం, కేంద్ర మంత్రి డ్రామాలు

- రేవంత్, కిషన్ రెడ్డి మెట్రో ఆస్తులపై కన్నేశారు..
- రైతుల సమస్యలపై పోరాడితే గృహ నిర్బంధాలా ?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 23 సిరి న్యూస్:

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కలిసి రాజకీయ నాటకాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన, రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నారని

మిగతా 3వ పేజీలో..



# రవాణా శాఖలో భద్రత కరువు!



- భూపాలపల్లి సంఘటనతో భయాందోళనలో ఉద్యోగులు
- అవినీతి పేరిట చెక్ పోస్ట్‌ల రద్దు..
- రోడ్లపైనే తనిఖీలు చేయాలని ఆదేశాలు
- ప్రాణసంకటంగా మారిన రహదారులపై తనిఖీ విధులు
- క్షేత్రస్థాయి సిబ్బందికి కరువైన ప్రభుత్వ వాహన సదుపాయం
- ఆఫీసు పనులు, ప్రత్యేక డ్రైవ్‌లతో అధికారులపై పెరిగిన పని ఒత్తిడి
- ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా.. మానసిక ఆందోళనలో సిబ్బంది
- సర్కారు నిర్ణయంతో రోడ్డెక్కిన ఉద్యోగులు!

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:

రహదారులపై ప్రమాదాలను నివారించి, ప్రయాణికులకు భద్రత కల్పించాల్సిన రవాణా శాఖ అధికారుల ప్రాణాలే ఇప్పుడు గాల్లో దీపంలా మారాయి. వ్యవస్థలో లోపాలను సరిచేసేందుకు ఏర్పాటైన రవాణా శాఖలో ప్రస్తుతం భద్రత కరువైందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. పేరుకే రవాణా శాఖ కానీ.. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి కనీస రక్షణ పరమైన సదుపాయాలు లేకపోవడంతో ఆ శాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయాలతో అధికారుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

**రవాణా శాఖలో రవాణా కరువు..**

రవాణా శాఖలో గతంలో కేవలం రిజిస్ట్రేషన్ల వ్యవస్థ మాత్రమే ఎక్కువగా ఉండేది. కానీ ప్రస్తుతం ప్రభుత్వం రిజిస్ట్రేషన్, లైసెన్సులకు సంబంధించిన పలు సేవలను ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం కల్పించింది. ఇది కార్యాలయాల్లో కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విషయంలో మాత్రం చిక్కులు తెచ్చిపెట్టింది. ప్రతి ఆర్టీఏ తమ పరిధిలో తరచూ వాహన తనిఖీలు చేయాల్సి

మిగతా 2వ పేజీలో..

## రేవంత్ పాలనంతా స్కాములే.. స్కీములు లేవు



- అచ్చంపేట నుండి అశ్వరావుపేట వరకు ఒకటే మాట వినిపిస్తుంది
- మాకు మళ్లీ కేసీఆరే రావాలి'..
- ప్రజల ఆకాంక్ష ఇదే
- బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు

02




## వైటీపీఎస్ ప్రైవేటీకరణ వద్దు..


- విద్యుత్ ఉద్యోగుల ఆందోళన
- భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన
- విద్యుత్ సౌధ సహా కేటీపీఎస్, ఎన్టీపీఎస్ తదితర కేంద్రాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

02

## వినియోగదారులకు సత్వర సేవలందించాలి

- వర్షాకాలంలో భద్రతతో కూడిన విద్యుత్ సరఫరా అందించాలి
- విద్యుత్ అంతరాయాలను నివారించాలి
- కాలిపోయిన, ఆగిపోయిన విద్యుత్ మీటర్లను వెంటనే మార్చాలి

03



## సర్ సదస్సులతో బీఆర్ఎస్‌లో జోష్

- కేసీఆర్ మార్గదర్శకత్వంలో సభలు
- రాష్ట్రవ్యాప్తంగా కేటీఆర్, హరీష్‌రావు విస్తృత పర్యటనలు
- అవగాహన కార్యక్రమాల పేరుతో కేడర్‌కు భరోసా
- నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి

02






## కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూన్ 23 సిరి న్యూస్:

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని

మిగతా 2వ పేజీలో..






## పేరు పెడితే రూ.లక్ష

- లక్ష ఫ్లాట్ల పథకానికి పేర్ల ఆహ్వానం
- ఉత్తమ పేరుకు నగదు బహుమతి
- ఈ నెల 28 వరకు అవకాశం
- హౌసింగ్ బోర్డు వినూత్న పోటీ

హైదరాబాద్, జూన్ 23 సిరి న్యూస్::

తెలంగాణలో అల్పాదాయ వర్గాల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న లక్ష ఫ్లాట్ల నిర్మాణ పథకానికి పేరు ఖరారు చేసేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజల నుంచే పేర్లను

మిగతా 2వ పేజీలో..

## స్వయం సమృద్ధి గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

- అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు
- గ్రామాలకు వచ్చే ప్రతీ రూపాయి ప్రజల జీవితాల్లో మార్పు తేవాలి
- అలసత్వం, నిబంధనల ఉల్లంఘనలను ఉపేక్షించబోం
- గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్రస్థాయి సమీక్షలో మంత్రి సీతక్క

02





## ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు మార్గదర్శకాలు

- కలెక్టర్లకు పూర్తి అధికారాలు
- డెప్యుటేషన్ టీచర్లను ప్రస్తుతం రిలీవ్ చేయొద్దు
- విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చర్యలు

హైదరాబాద్, జూన్ 23 సిరి న్యూస్:

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపు, మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు

మిగతా 3వ పేజీలో..



## టీజీఈసెట్ తొలి విడతలో 59 శాతం సీట్లు భర్తీ

- 8,829 మందికి సీట్ల కేటాయింపు
- జూన్ 27లోపు ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ తప్పనిసరి
- తుది విడత తర్వాత జూలై 10 నుంచి కాలేజీల్లో రిపోర్టింగ్

03

# పేరు పెడితే రూ.లక్ష

**మొదటిపేజీ తరువాయి**

ఆహ్వానిస్తూ, ఉత్తమమైన పేరును సూచించిన వ్యక్తికి రూ.లక్ష నగదు బహుమతి ప్రకటించింది.

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా క్యూర్ పరిధిలో లక్ష ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు కానున్న ఈ భారీ గృహ నిర్మాణ ప్రాజెక్టుకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే ఉద్దేశంతో ఈ పోటీ నిర్వహిస్తున్నారు.

తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 28వ తేదీ వరకు ప్రజల నుంచి పేర్ల సూచనలను స్వీకరిస్తారు. వచ్చిన ప్రతిపాదనల్లో ఉత్తమమైన పేరును ఎంపిక చేసి, ఆ పేరును సూచించిన వ్యక్తికి రూ.లక్ష నగదు బహుమతి అందజేయనున్నారు.

**సోషల్ మీడియాలో సూచనలు**

పోటీలో పాల్గొనాలనుకునే వారు హౌసింగ్ శాఖ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా tghd.official ద్వారా తమ సూచనలను పంపవచ్చు. ఈ కార్యక్రమంలో ఎక్కువ మంది ప్రజలు పాల్గొనేలా సోషల్ మీడియా వేదికను వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**త్వరలో పూర్తి వివరాలు**

క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఫ్లాట్ల నిర్మాణానికి అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించారు. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ, అర్హతలు, లాటరీ విధానం ద్వారా ఇళ్ల కేటాయింపు వంటి పూర్తి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయనుంది. సుదీర్ఘ విరామం తర్వాత చేపడుతున్న ఈ భారీ గృహ నిర్మాణ ప్రాజెక్టుపై అల్పాదాయ వర్గాల ప్రజల్లో ఆసక్తి నెలకొంది. సొంతింటి కలను సాకారం చేసే ఈ పథకానికి ప్రజలే పేరు పెట్టే అవకాశం కల్పించడం విశేషంగా మారింది.




## పద్మ పురస్కారాలతో
# రాష్ట్రపతి భవన్ కళకళ

**న్యూఢిల్లీ, జూన్ 23 సిరి న్యూస్:**

దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు.

భారతీయ సినీ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా మలయాళ సినీ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో భారత టెన్నిస్‌కు విశేష గుర్తింపు తీసుకొచ్చిన విజయ్ అమృత్‌రాజ్‌కు కూడా పద్మభూషణ్ అవార్డు అందజేశారు. వైద్య రంగంలో చేసిన సేవలకు ప్రముఖ వైద్యుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని పద్మభూషణ్‌తో సత్కరించారు.

గిరిజనుల హక్కుల కోసం దీర్ఘకాలం పోరాటం చేసిన జేఎంఎం వ్యవస్థాపకుడు శిబు సోరెన్‌కు మరణానంతరం పద్మభూషణ్ పురస్కారం ప్రకటించారు. ఆయన తరఫున సతీమణి రూపి సోరెన్ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.

తెలుగు చలనచిత్ర రంగానికి చెందిన సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌లకు పద్మశ్రీ పురస్కారాలు లభించాయి. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన వేడుకలో వారు అవార్డులను అందుకున్నారు. విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా తెలంగాణకు చెందిన శాస్త్రవేత్త చంద్రమౌళికి పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులు, విశిష్ట వ్యక్తుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.

## రేవంత్ పాలనంతా స్కాములే..
# స్కీములు లేవు

**అశ్వారావుపేట జూన్23 సిరి న్యూస్:**

కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు విమర్శించారు. అశ్వారావుపేటలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

అచ్చంపేట నుంచి అశ్వారావుపేట వరకు ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా వంటి హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రైతులకు నష్టపరిహారం అందించకపోవడంతో పాటు యూరియా సరఫరాలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు.బీఆర్ఎస్ హయాంలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ వంటి పథకాలు అమలు చేశామని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు కేటాయించిన నిధులు విడుదల కాకపోవడంతో దళితులు, గిరిజనులు నష్టపోతున్నారని ఆరోపించారు.ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగలేదని, సీతారామ ప్రాజెక్టు పనులు మందగించాయని, అశ్వారావుపేటలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని అన్నారు.మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలపై స్పందించిన హరీష్ రావు, రైతు బంధు నిధుల అంశంపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో
# రాష్ట్ర మంత్రుల భేటీ

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# స్వయం సమృద్ధి గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

తీసిపోని మౌలిక వసతులతో తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ, సెర్ప్, ఉపాధి హామీ పథకం తదితర విభాగాల అధికారులతో మంత్రి సీతక్క సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్యా దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏడు గంటలపాటు సాగిన సమావేశంలో శాఖల వారీగా పనుల పురోగతి, భవిష్యత్తు లక్ష్యాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో సుమారు 1.35 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఏటా రూ.34 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చవుతున్నాయని గుర్తు చేశారు. ఇంత భారీ యంత్రాంగం, నిధులు ఉన్నప్పటికీ గ్రామాల రూపురేఖలు ఆశించిన స్థాయిలో మారకపోవడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. 'ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనిచేస్తే ఫలితాలు రావు.. జిల్లా స్థాయిలో అన్ని శాఖల అధికారులు ఒకే టీమ్‌గా పనిచేయాలి.. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి.. ప్రతీ గ్రామానికి అవసరాలు, వనరులు, సమస్యలను గుర్తించి వాటి ఆధారంగా కార్యాచరణ అమలు చేయాలి' అని ఆదేశించారు. గ్రామాల్లో అపారమైన సహజ, మానవ వనరులు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగిస్తే గంగదేవిపల్లి వంటి ఆదర్శ గ్రామాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్మించవచ్చని మంత్రి అన్నారు. వచ్చే రెండు నెలల్లో గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి తీసుకురావాలని అధికారులకు గడువు విధించారు. గ్రామాలకు వచ్చే ప్రతీ రూపాయి ప్రజల ప్రయోజనాలకే ఖర్చు కావాలని స్పష్టం చేసిన మంత్రి ఒక్కో నీటి బొట్టును ఎలా పొదుపుగా వాడుకుంటామో గ్రామాలకు వచ్చే ప్రతీ రూపాయిని కూడా అంతే జాగ్రత్తగా వినియోగించాలి. ప్రజల డబ్బును వృథా చేయడానికి ఎవరికీ హక్కు లేదు అని అన్నారు. స్థానిక సంస్థల నిధుల వినియోగంపై మాట్లాడుతూ కొన్నిచోట్ల గ్రామ సభలు నిర్వహించకుండా నిధులు ఖర్చు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు నిధుల వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. 'నేను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాను.. జిల్లాల్లో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటాను.. నిర్లక్ష్యం, అలసత్వం, బాధ్యతారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు' అని మంత్రి అధికారులను హెచ్చరించారు. సమీక్షలో ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పని దినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులు, అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణాలు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు, పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్లు, స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధన, గ్రామ కార్యదర్శుల హాజరు తదితర అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు.

**జల సంరక్షణే భవిష్యత్ భద్రత**

వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. చెరువులు, కుంటలు, బావులు, వాగులను పరిరక్షించడం గ్రామీణాభివృద్ధిలో అత్యంత కీలకమన్నారు. 'చెరువును కాపాడుకుంటే ఊరిని కాపాడుకున్నట్టే.. పాత బావులను గుర్తించి పునరుద్ధరించాలి.. బావుల చుట్టూ రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలను నివారించాలి.. ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరిలో ఊట కుంట ఉండేలా చర్యలు చేపట్టాలి' అని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'జలసిరి' అవగాహన పోస్టర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

**ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు చేరాలి**

వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మిషన్ భగీరథ అధికారులకు మంత్రి సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు సహా ప్రతి ఇంటికీ నిరంతరాయంగా రక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిర్మిస్తున్న రహదారులకు కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతుల సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. 'పట్టణాల్లో స్కైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తుంటే అటవీ గ్రామాల్లో కనీసం బీటీ రోడ్డు వేయడానికీ అనుమతులు రావడం లేదు.. కేంద్రం నిధులు మంజూరు చేసిన తర్వాత కూడా అనుమతుల పేరుతో అడ్డంకులు సృష్టించడం వల్ల ఆదివాసి గిరిజన గ్రామాలు ఇంకా వెనకబాటులోనే ఉన్నాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరగనున్న సమావేశంలో రాష్ట్ర సమస్యలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు. పీఎంజీఎస్‌వై కింద అటవీ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు, కేంద్రంతో సంప్రదింపులు జరిపేందుకు శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు.

**మహిళా సంఘాలే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక**

మహిళా సంఘాల బలోపేతం, బ్యాంకు లింకేజీల పెంపు, మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సెర్ప్ అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళల ఆర్థిక సాధికారత పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సమావేశం ముగింపులో మంత్రి సీతక్క మాట్లాడుతూ 'మనందరిదీ గ్రామీణ నేపథ్యమే.. గ్రామీణ ప్రజల కష్టాలు మనకు తెలుసు.. కాబట్టి గ్రామాల్లో సమస్యలు తలెత్తకముందే పరిష్కారాలు చూపాలి.. తెలంగాణ గ్రామాలను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే బాధ్యత మనందరిది' అని అధికారులకు పిలుపునిచ్చారు.

**మెరుగైన పనితీరు కనబరుస్తున్న అధికారులకు సన్మానం**

హోదాను పక్కనపెట్టి మెరుగైన పనితీరును కనబరుస్తున్న అధికారులను మంత్రి సీతక్క శాలువాతో సన్మానించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కేవలం రెండున్నర నెలల్లో 7.44 కోట్ల పని దినాలు పూర్తి చేసినందుకు సెక్రటరీ దాన కిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్‌లను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. జిల్లాస్థాయిలో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా రికార్డు స్థాయిలో అమలు చేసినందుకు డీఆర్డీవోలకు స్వీట్ బాక్స్‌లు అందజేశారు. దివ్యాంగులకు యూడిఐడి కార్డులను అందించడంలో కీలక పాత్ర పోషించిన సెర్ప్ డైరెక్టర్ సాయికుమార్‌ను అభినందించి సన్మానించారు.

# సర్ సదస్సులతో బీఆర్ఎస్‌లో జోష్

**హైదరాబాద్, జూన్ 23 సిరి న్యూస్**


తెలంగాణలో ప్రస్తుతం ఎన్నికల వాతావరణం లేకపోయినా బీఆర్ఎస్ అగ్రనేతలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు నిర్వహిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించే కార్యక్రమాలను పార్టీ సంస్థాగత బలోపేతానికి వినియోగించుకుంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కేటీఆర్, హరీష్‌రావు జిల్లాల వారీగా పర్యటిస్తూ నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నేతలతో ముఖాముఖి చర్చలు జరుపుతూ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో బీఎల్ఏలను నియమించి వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

సదస్సుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కూడా నాయకత్వం కీలక సూచనలు చేస్తోంది. తదుపరి ఎన్నికలకు సమయం తగ్గుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో కార్యాచరణ సాగుతున్నట్లు తెలుస్తోంది.

**కేడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నం**

నియోజకవర్గ సమన్వయ సమావేశాల్లో కేటీఆర్, హరీష్‌రావు కార్యకర్తలను ఉత్సాహపరిచే విధంగా ప్రసంగిస్తున్నారు. స్థానిక



సమస్యలతో పాటు రాష్ట్ర రాజకీయ పరిణామాలపై కూడా స్పందిస్తూ పార్టీ శ్రేణుల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో ఈ సమావేశాలకు కార్యకర్తల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకే రోజులో రెండు లేదా అంతకంటే ఎక్కువ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తూ నేతలు కేడర్‌తో ప్రత్యక్షంగా మమేకమవుతున్నారు. మాజీ మంత్రులు, ఇతర రాష్ట్ర స్థాయి నాయకులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

**కేసీఆర్ మార్గదర్శకత్వంలో కార్యక్రమాలు**

నియోజకవర్గాల వారీగా జరుగుతున్న సమన్వయ సమావేశాలను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏ అంశాలపై దృష్టి పెట్టాలనే విషయాల్లో నాయకత్వానికి సూచనలు అందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సగానికి పైగా నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తవగా, మిగిలిన ప్రాంతాల్లో కూడా కార్యక్రమాలను విస్తరించాలని పార్టీ యోచిస్తోంది. ఎస్ఐఆర్ అవగాహన సదస్సుల రూపంలో నిర్వహిస్తున్న ఈ సమావేశాలు పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతున్నాయని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి.

## వైటీపీఎస్ ప్రైవేటీకరణ వద్దు..

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. భోజన విరామ సమయంలో ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి తమ వ్యతిరేకతను చాటారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల నిర్వహణను ఔట్ సోర్సింగ్ సిబ్బందికి అప్పగించడాన్ని విద్యుత్ ఉద్యోగులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడంలో భాగంగానే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఇలాంటి చర్యలకు పూనుకుంటోందని వారు ఆరోపించారు. ఇప్పటికే కొత్తగా 'రైతు డిస్కమ్' ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తెరపైకి వస్తుండటంతో, భవిష్యత్తులో ప్రస్తుతం ఉన్న డిస్కమ్‌లను సైతం ప్రైవేట్ పరం చేస్తారేమోనన్న భయం ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ఈ ప్రైవేటీకరణ నిర్ణయాలకు వ్యతిరేకంగా కేటీపీఎస్, ఎన్టీపీఎస్ కేంద్రాలతో పాటు, డిస్కమ్, ట్రాన్స్‌కోల ప్రధాన కార్యాలయమైన హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలోనూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖలో ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

# రవాణా శాఖలో భద్రత కరువు!

**మొదటిపేజీ తరువాయి**

వస్తోంది. అయితే, విచిత్రం ఏమిటంటే.. పైస్థాయి అధికారికి మినహా, కింది స్థాయి సిబ్బందికి (ఏఎంవీఐ, కానిస్టేబుల్స్) ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక వాహన సదుపాయం లేదు. దీంతో, తనిఖీలకు వెళ్లే సిబ్బంది తమ సొంత బైక్‌లు, కార్లపైనే హైవేలకు వెళ్లాల్సి రావడం గమనార్హం. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘించిన భారీ వాహనాలు ఆపకుండా వెళ్లిపోతే, సొంత ద్విచక్ర వాహనాలపై వాటిని ఎలా వెంబడించగలమని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రాణసంకటంగా మారిన తనిఖీలు..**
**భూపాలపల్లి ఘటనే నిదర్శనం**

తెలంగాణలో ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక అవినీతి ఆరోపణల నేపథ్యంలో బోర్డర్ చెక్ పోస్ట్‌ల విధానాన్ని రద్దు చేసింది. కానీ, ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా ఉండేందుకు నిత్యం రహదారులపైన వాహనాలు ఆపి తనిఖీలు చేయాలని ఆదేశించింది. చెక్ పోస్ట్ ఉన్నప్పుడు.. అక్కడ బారికేడ్లు, లైటింగ్, పోలీసుల భద్రత ఉండేది. వాహనదారుడే అక్కడికి వచ్చి కావాల్సిన పత్రాలు చూపించేవారు. కానీ, ఇప్పుడు రద్దీగా ఉండే హైవేలపై, ఎలాంటి రక్షణ లేని ప్రాంతాల్లో నేరుగా వాహనాలను ఆపడం అధికారులకు ప్రాణసంకటంగా మారింది. అతివేగంగా వచ్చే లారీలు, టిప్పర్లను రోడ్లపై ఆపే క్రమంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. నిన్న భూపాలపల్లి జిల్లాలో చోటుచేసుకున్న సంఘటనే ఇందుకు నిదర్శనం. తనిఖీలు చేస్తున్న అధికారులపైకి దూసుకెళ్లేలా కొందరు ప్రవర్తిస్తుండటంతో, ఇలాంటి పరిస్థితుల్లో తమకు రక్షణ ఏదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మానసిక ఒత్తిడిలో సిబ్బంది**

గతంలో చెక్ పోస్టులు ఉన్నపుడు ఆయా ప్రాంతాలలో తనిఖీల కోసం ప్రత్యేక సిబ్బంది (చెక్ పోస్ట్ డ్యూటీ) ఉండేవారు. దీంతో ఆర్టీఏ ఆఫీసులో పని చేస్తున్న అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేయాల్సిన పని పెద్దగా ఉండేది కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. ఉదయం కార్యాలయానికి వచ్చే దరఖాస్తుల పరిశీలన, డ్రైవింగ్ టెస్ట్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ వంటి రోజువారీ ఆఫీసు విధులను పూర్తి చేయాలి. ఆ వెంటనే సాయంత్రం లేదా రాత్రి వేళల్లో మళ్లీ రోడ్లపైకి వెళ్లి టార్గెట్ల మేరకు వాహనాల తనిఖీలు చేయాల్సి వస్తోంది.



ఈ ద్వంద్వ విధులు అధికారులను శారీరకంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి.

**ప్రభుత్వం స్పందించాలి..**

అవినీతిని అరికట్టే ఉద్దేశ్యంతో చెక్ పోస్టులను ఎత్తివేయడం మంచిదే అయినా.. దానికి ప్రత్యామ్నాయంగా సురక్షితమైన తనిఖీ విధానాలను తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వస్తున్నాయి. కేవలం ఆదాయం పైనే దృష్టి పెట్టకుండా, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తగిన భద్రత కల్పించాలని, అధికారిక వాహనాలు మంజూరు చేయాలని, హైవేలపై పోలీసు బందోబస్తు మధ్య మాత్రమే తనిఖీలు చేసేలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని రవాణా శాఖ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో విధులను బహిష్కరించి ఆందోళనను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

# వినియోగదారులకు సత్వర సేవలందించాలి

**నల్గొండ, జూన్ 23 (సిరి న్యూస్):**



విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు ఎలాంటి ఇక్కట్లు రాకుండా చూసుకోవాలని, సత్వర సేవలు అందించాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నల్గొండ ఎలక్ట్రిసిటీ గెస్ట్ హౌస్‌లో జిల్లా స్థాయి విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ సర్కిల్‌కు సంబంధించిన టీకోడ్ అంచనాలు, వివిధ అభివృద్ధి పనుల పురోగతి, అమలు పరిస్థితులు మరియు పెండింగ్ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. కాలిపోయిన మరియు పనిచేయడం నిలిచిపోయిన (స్టక్అప్) విద్యుత్ మీటర్లను త్వరితగతిన మార్చాలని, తద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సీఎండీ ఆదేశించారు. 202324, 202425 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఇంకా పూర్తికాని పనుల పురోగతి, వాటికి అవసరమైన మెటీరియల్, నిధుల గురించి ఆరా తీశారు. అలాగే రాబోయే 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కొత్త అంచనాలు, బడ్జెట్ ఇండెంట్లు మరియు ప్రతిపాదిత పనులపై సమీక్షించారు. విద్యుత్ మౌలిక వసతుల బలోపేతానికి అవసరమైన కండక్టర్లు, కేబుళ్లు, విద్యుత్ స్తంభాలు, ఇంటర్మీడియట్ పోల్స్ ఏర్పాటు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ప్లింత్ రైజింగ్ తదితర పనులకు కావలసిన సామగ్రి వివరాలను అధికారులు ఈ సందర్భంగా సీఎండీకి వివరించారు. వర్షాకాల సన్నద్ధత, విద్యుత్ అంతరాయాల నివారణ చర్యలు, ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ట్రిమ్మింగ్) కార్యక్రమాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు మరియు వినియోగదారుల సేవల మెరుగుదలపై లోతుగా చర్చించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీఎండీ సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ వ్యవస్థ సజావుగా, సురక్షితంగా పనిచేసేలా క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నరసింహులు, చీఫ్ ఇంజనీర్ (రూరల్ జోన్) బాలస్వామి, ఎస్ఈ (ఆపరేషన్స్‌నల్గొండ) వెంకటేశ్వర్లు, నల్గొండ సర్కిల్ పరిధిలోని 33 మండలాలు, 5 మున్సిపాలిటీలకు చెందిన డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఏఏఈలు, జేపీఓలు, ఎస్ఏఓలు మరియు ఇతర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మెట్రోపై సీఎం, కేంద్ర మంత్రి డ్రామాలు

**మొదటిపేజీ తరువాయి**

విమర్శించారు. హైదరాబాద్‌లో పరస్పరం విమర్శలు చేసుకుంటూ, ఢిల్లీలో కలిసి సమావేశాలు నిర్వహించడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని అన్నారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టును రద్దు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో విస్తరణకు అనుమతులు ఇవ్వలేదని ఆరోపిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇద్దరినీ ప్రజలు గుర్తుంచుకుంటారని వ్యాఖ్యానించారు.

**మెట్రో ఆస్తులపై కుట్ర జరుగుతోందన్న ఆరోపణ**

హైదరాబాద్ మెట్రోకు సంబంధించిన వందల ఎకరాల భూములు, వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులపై ప్రభుత్వం కన్నేసిందని కేటీఆర్ ఆరోపించారు. మెట్రో నిర్వహణలో ఉన్న ప్రైవేటు సంస్థపై ఒత్తిడి తీసుకువచ్చి, భారీ ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. గతంలో ప్రతిపాదించిన లక్డీకాపూల్‌పటాన్‌చెరువు మెట్రో మార్గానికి కేంద్రం ఎందుకు ఆమోదం తెలపలేదని ప్రశ్నించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి విమానాశ్రయం వరకు ప్రతిపాదించిన మెట్రో మార్గాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ మళ్లీ వేగం అందుకోవాలంటే కేసీఆర్ నాయకత్వం అవసరమని పేర్కొన్నారు.

**మూసీ ప్రాజెక్టుపై విమర్శలు**

మూసీ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం భారీ వ్యయాలకు సిద్ధమవుతోందని, అయితే ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో మాత్రం ఆసక్తి చూపడం లేదని కేటీఆర్ ఆరోపించారు. నగర అభివృద్ధి పేరిట ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై కూడా ఆయన ప్రస్తావిస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గానికి ఎంత మేర నిధులు తీసుకొచ్చిందో వెల్లడించాలని ఎమ్మెల్యే గాంధీని డిమాండ్ చేశారు.

**రైతుల సమస్యలపై ఆందోళన**

రాష్ట్రంలో ఎరువుల సరఫరా సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, యూరియా పంపిణీలో అమలు చేస్తున్న విధానాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. రైతుల తరపున ప్రశ్నించే నాయకులను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గృహ నిర్బంధాలు, ఆంక్షలతో బీఆర్ఎస్ నాయకులను గానీ, రైతులను గానీ భయపెట్టలేరని హెచ్చరించారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

## ప్రముఖ రెస్టారెంట్లలో

# ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

- **కంచి కేఫ్, కోడికూర చిట్టిగారేకు నోటీసులు**
- **అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలపై అధికారుల ఆగ్రహం**
- **ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆదేశాలు**

**హైదరాబాద్, జూన్ 23 సిరి న్యూస్:**

సైబరాబాద్ పరిధిలోని రెండు ప్రముఖ రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో పలు నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పరిస్థితులు గుర్తించిన అధికారులు సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు.

**కంచి కేఫ్‌లో తీవ్ర లోపాలు**

పుప్పాలగూడలోని కంచి కేఫ్‌లో నిర్వహించిన తనిఖీల్లో కిచెన్, స్టోర్ రూమ్ మధ్య ఓపెన్ డస్ట్‌బిన్లు ఉండటంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు ఈగలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. స్టోర్ రూమ్ సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోవడం, కూరగాయలు కట్ చేసే ప్రాంతాలు, గ్రైండింగ్ విభాగంలో నీరు నిల్వ ఉండటం కనిపించింది.

వంటకు వినియోగించే కాలీఫ్లవర్‌పై ఫంగస్ ఉండటాన్ని అధికారులు గుర్తించారు. డ్రెయిన్ల వద్ద దుర్వాసన రావడం, ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన పిండిపై వివరాల లేబుల్స్ లేకపోవడం కూడా వెలుగుచూసింది. వంటగది, స్టోర్ రూమ్‌లలో ఈగలు, బొద్దింకలు సంచరిస్తుండటంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

అదనంగా ఉద్యోగుల వైద్య ధ్రువపత్రాలు, క్రిమిసంహారక చర్యలు, నీటి పరీక్షలు, ప్యాకేజింగ్ సామగ్రి పరీక్షలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేకపోవడంతో యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఆహార పదార్థాల లేబులింగ్, పరిశుభ్రత ప్రమాణాలను వెంటనే మెరుగుపరచాలని ఆదేశించారు.

**కోడికూర చిట్టిగారేలోనూ ఉల్లంఘనలు**

నల్లగండ్లలోని కోడికూర చిట్టిగారే రెస్టారెంట్‌లో నిర్వహించిన తనిఖీల్లో నిల్వ ఉంచిన చికెన్, తీపి పదార్థాలపై ఎలాంటి లేబుల్స్ లేకపోవడం గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన ఆహార పదార్థాలను అధికారులు అక్కడికక్కడే తొలగింపజేశారు.

గ్రైండింగ్ విభాగం సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోవడంతో పాటు కిచెన్ సీలింగ్ అంతా జిడ్డుగా మారినట్లు గుర్తించారు. వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని ఆదేశించారు.

ఉద్యోగుల వైద్య అర్హత ధ్రువపత్రాలు, ప్యాకేజింగ్ సామగ్రి పరీక్షల రికార్డులు లేకపోవడంతో ఈ రెస్టారెంట్ యాజమాన్యానికీ ఫుడ్ సేఫ్టీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని హెచ్చరించారు.

## ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగించే

# వారిపై కఠిన చర్యలు

- **ట్రాఫిక్ శిక్షణ పొందిన గ్రేహౌండ్స్‌తో సైబరాబాద్ సీపీ**

**శేరిలింగంపల్లి, జూన్ 23 సిరి న్యూస్:**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధుల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణ పొందిన 150 మంది గ్రేహౌండ్స్ పోలీసు సిబ్బందితో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం.రమేష్ (ఐపీఎస్) మంగళవారం సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారం రోజులపాటు నిర్వహించిన ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న సిబ్బందితో సీపీ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాల గురించి వివరాలు తెలుసుకున్నారు. ట్రాఫిక్ విధులను సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం, ట్రాఫిక్ నియంత్రణలో పాటించాల్సిన విధానాలు, చట్టపరమైన అంశాలపై సీపీ సూచనలు చేశారు. శిక్షణలో ట్రాఫిక్ నిర్వహణ,ట్రాఫిక్ ఇంజనీరింగ్, చట్టపరమైన విషయాలు తదితర అంశాలపై ఇండోర్ అవుట్‌డోర్ తరగతుల ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. హెల్మెట్ ధారణ, లేన్ క్రమశిక్షణ, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలని, ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని గుర్తు చేశారు. ప్రతి సిబ్బంది ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై చైతన్యం కల్పించాలని ఆదేశించారు.ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో అక్కడ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో అడ్మిన్ డీసీపీ టి.అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రి రెడ్డి, సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు,ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# టీజీఈసెట్ తొలి విడతలో 59 శాతం సీట్లు భర్తీ

**హైదరాబాద్, జూన్ 23 సిరి న్యూస్:**

టీజీఈసెట్ తొలి విడత ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల వెబ్ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. డిప్లొమా, బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులకు లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు సంబంధించిన వివరాలను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, కన్వీనర్ ఎ. శ్రీదేవసేన వెల్లడించారు.

ఈసెట్ పరీక్షలో మొత్తం 17,768 మంది అర్హత సాధించగా, 11,576 మంది సర్టిఫికెట్ ధ్రువీకరణకు హాజరయ్యారు. వీరిలో 11,172 మంది వెబ్ ఆప్షన్లు నమోదు చేశారు. మొత్తం 3,56,192 వెబ్ ఆప్షన్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న 14,890 సీట్లలో తొలి విడతలో 8,829 సీట్లను కేటాయించారు. దీంతో మొత్తం సీట్ల భర్తీ శాతం 59కు చేరింది. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 460 మందికి సీట్లు లభించాయి. స్పోర్ట్స్, ఎన్‌సీసీ కోటాలకు సంబంధించిన సీట్ల కేటాయింపును తుది విడత కౌన్సెలింగ్‌లో చేపట్టనున్నారు.

సీట్లు పొందిన అభ్యర్థులు జూన్ 27లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అనంతరం సెల్ఫ్ రిపోర్టింగ్ విధానం ద్వారా జాయినింగ్ రిపోర్ట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫీజు చెల్లించకపోయినా, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకపోయినా కేటాయించిన సీటు స్వయంచాలకంగా రద్దవుతుందని అధికారులు హెచ్చరించారు. జూన్ 27లోపు సీటును ఆన్‌లైన్‌లో రద్దు చేసుకుంటే చెల్లించిన పూర్తి ఫీజు తిరిగి పొందే అవకాశం ఉంటుంది. తుది విడత కౌన్సెలింగ్ పూర్తైన తర్వాత జూలై 10 నుంచి 13 వరకు కేటాయించిన కళాశాలల్లో ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరై ప్రవేశ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.

అభ్యర్థులు ఆన్‌లైన్‌తో పాటు కళాశాలలో కూడా యాంటీ డ్రగ్ అఫిడవిట్ డిక్లరేషన్ సమర్పించడం తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు.

**సీట్ల భర్తీ వివరాలు**

ఇంజనీరింగ్ కోర్సుల్లో 168 కళాశాలల్లో అందుబాటులో ఉన్న 13,610 సీట్లకు గానూ 8,799 సీట్లు భర్తీ అయ్యాయి. ఇది 65 శాతం భర్తీకి సమానం.

ఫార్మసీ కోర్సుల్లో 123 కళాశాలల్లో ఉన్న 1,280 సీట్లకు గానూ 30 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. మొత్తంగా 14,890 సీట్లలో 8,829 సీట్లు కేటాయించబడగా, మొత్తం భర్తీ శాతం 59గా నమోదైంది.



# ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు మార్గదర్శకాలు

**మొదటిపేజీ తరువాయి**

ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించింది. ఈ ప్రక్రియ నిర్వహణకు జిల్లాల కలెక్టర్లకు పూర్తి అధికారాలు అప్పగించింది.

జిల్లాల్లో విద్యార్థుల సంఖ్య, పాఠశాలల అవసరాలు, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల లభ్యతను పరిశీలించి సర్దుబాటు చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. పాఠశాలల అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

ఈ ఏడాది ఏప్రిల్ 22న పని సర్దుబాటు కింద అవసరమైన పాఠశాలలకు డెప్యుటేషన్‌పై పంపిన ఉపాధ్యాయులను ప్రస్తుతం రిలీవ్ చేయవద్దని జిల్లా విద్యాశాఖాధికారులకు స్పష్టం చేసింది. సంబంధిత పాఠశాలల్లో ఆయా సబ్జెక్టులకు అవసరం ఉన్నంతకాలం వారు అక్కడే కొనసాగాలని మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు సూచించింది. ఉపాధ్యాయుల పదవీ విరమణ, దీర్ఘకాలిక సెలవులు లేదా ఇతర కారణాలతో ఖాళీలు ఏర్పడిన సందర్భాల్లో విద్యార్థుల బోధనకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపింది. అవసరమైతే మిగులు ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ అనుమతితో డెప్యుటేషన్‌పై పంపాలని డీఈఓలకు సూచించింది.

జూన్ 20, 2026 నాటి విద్యార్థుల నమోదు సంఖ్యను ప్రాతిపదికగా తీసుకుని, జీఓ నంబర్ 25 మార్గదర్శకాల మేరకు పాఠశాలల వారీగా, సబ్జెక్టుల వారీగా విశ్లేషణ చేపట్టి సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు అవసరమైన బోధనా సిబ్బంది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# టిమ్స్‌లో 184 ఉద్యోగాలు.. జూలై 6 వరకు దరఖాస్తులకు అవకాశం

- **నిమ్స్ ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ**
- **మెడికల్ ఫ్యాకల్టీ, సాంకేతిక, పరిపాలన విభాగాల్లో ఖాళీలు**
- **వాక్-ఇన్ ఇంటర్వ్యూలు, ప్రత్యక్ష దరఖాస్తుల ద్వారా ఎంపిక**

**హైదరాబాద్, జూన్ 23 సిరి న్యూస్:**

హైదరాబాద్ సనత్‌నగర్‌లోని తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ (టిమ్స్)లో వైద్య సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిమ్స్ తరహాలో టిమ్స్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అక్కడి ఖాళీల భర్తీ బాధ్యతలను నిమ్స్‌కు అప్పగించింది. ఈ నేపథ్యంలో టిమ్స్‌లో ఖాళీగా ఉన్న 184 కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి నిమ్స్ మూడు వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు జూలై 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**మూడు నోటిఫికేషన్లలో 184 పోస్టులు**

మొదటి నోటిఫికేషన్ ద్వారా 31 మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో 5 ప్రొఫెసర్లు, 2 అసోసియేట్ ప్రొఫెసర్లు, 24 అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీలు ఉన్నాయి. కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో వీరిని నియమించనున్నారు.

రెండో నోటిఫికేషన్ ద్వారా 122 సాంకేతిక, పరిపాలన పోస్టులను భర్తీ చేస్తారు. ప్రయోగశాలలు, రక్తనిధి, అనస్థీషియా, ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే, ఈసీజీ, బయోమెడికల్ విభాగాల సాంకేతిక నిపుణులతో పాటు మెడికల్ రికార్డు అధికారి, సహాయ ప్రజా సంబంధాల అధికారి, గణాంక నిపుణుడు, రిజిస్ట్రార్, ఖాతాల విభాగం, ఆరోగ్య పరిశీలకుడు వంటి పోస్టులు ఇందులో ఉన్నాయి.

మూడో నోటిఫికేషన్ కింద 31 ఇతర సేవల పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో న్యాయ అధికారి, ప్రజాసంబంధాల అధికారి, ప్రధాన భద్రతాధికారి, భద్రతాధికారులు, పర్‌ఫ్యూజనిస్టులు, బయోమెడికల్ ఇంజనీర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, హార్డ్‌వేర్ ఇంజనీర్, అగ్నిమాపక అధికారి, సహాయ అగ్నిమాపక అధికారులు, ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్, ప్లాస్టర్ అసిస్టెంట్లు ఉన్నారు.

**అర్హతలు, వయోపరిమితి**

మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు సంబంధిత సూపర్ స్పెషాలిటీ విభాగంలో డీఎమ్, ఎంసీహెచ్, డీఎన్‌బీ లేదా డాక్టర్ ఎన్‌బీ అర్హతతో పాటు నిబంధనల ప్రకారం బోధనా అనుభవం ఉండాలి. ఇతర పోస్టులకు డిగ్రీ, పీజీ, డిప్లొమా, బీఎస్సీ, బీఈ, బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ తదితర అర్హతలు పోస్టుల వారీగా నిర్దేశించారు.

మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 50 నుంచి 58 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయో సడలింపు వర్తిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా నిబంధనల ప్రకారం సడలింపులు లభిస్తాయి.

**దరఖాస్తు విధానం**

మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసేవారు దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి అవసరమైన ధ్రువపత్రాలతో జూలై 6 ఉదయం 9 గంటలకు నిమ్స్‌లో జరిగే వాక్ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి. సాంకేతిక, పరిపాలన, ఇతర పోస్టులకు దరఖాస్తు చేసేవారు పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు విద్యార్హతలు, అనుభవ ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డు, జనన ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ, నాన్‌క్రీమీ లేయర్, ఈడబ్ల్యూఎస్, సదరం ధ్రువపత్రాలు, అవసరమైతే ఎన్‌వోసీ జతచేసి జూలై 6 సాయంత్రం 4 గంటలలోపు నిమ్స్ కార్యాలయంలో సమర్పించాలి.

**దరఖాస్తు ఫీజులు**

మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు సాధారణ అభ్యర్థులు రూ.2,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.1,000 చెల్లించాలి. ఇతర పోస్టులకు సాధారణ అభ్యర్థులు రూ.1,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజును డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో లేదా నిమ్స్‌లోని బిల్లింగ్ కౌంటర్ వద్ద చెల్లించవచ్చు.

**ఎంపిక విధానం**

మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేపడతారు. విద్యార్హతలు, బోధనా అనుభవం, వైద్య అనుభవం, పరిశోధనా ప్రచురణలు, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఇతర పోస్టులకు దరఖాస్తుల సంఖ్యను బట్టి ఇంటర్వ్యూ, స్క్రీనింగ్, రాత పరీక్ష, నైపుణ్య పరీక్ష లేదా వీటి సమ్మేళనం ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. పోస్టుల వారీగా పూర్తి వివరాలు, వేతనాలు, రిజర్వేషన్ వివరాలు నిమ్స్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.



# గుర్తుతేలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

**పాపన్నపేట్ జూన్ 23 (సిరి న్యూస్):**



సుమారు (55) సం రాల వయసు గల ఓ వృద్ధురాలి మృతదేహం ఏడుపాయల చెక్ డ్యాం లో లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం చెక్ డ్యాం లో ఓ వృద్ధురాలి మృతదేహం గమనించిన స్థానికులు పాపన్న పేట పోలీసులకు సమాచారం అందజేయడం తో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని వెలికి తీసి మృతురాలి ఆచూకీ కోసంపరిశీలించగా ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదని. మృతురాలి దేహం పై బ్లూ కలర్ నైటీ తోపాటు, చెవులకు రేడిమెట్ కమ్మలు, ముక్కు పుడక ఉందని. మృతురాలి ఫోటోఆధారంగామృతురాలిని గుర్తించిన వారు పాపన్న పేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ చరవాణి 87126 57920, రూరల్ సీఐ కృష్ణమూర్తి 87126 57883 చరవాణి లకు సంప్రదించాలని వారు కోరారు.

# విలేఖరి పై దాడిని ఖండించిన ప్రెస్ క్లబ్



**పాపన్నపేట్ జూన్ 23 (సిరి న్యూస్) :**

నార్సింగి మండలంలో మన తెలంగాణ దినపత్రిక విలేకరి రాఘవేందర్‌పై సోమవారం జరిగిన దాడిని పాపన్నపేట మండల ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్యంలో మీడియా ప్రతినిధులపై దాడులు ఆందోళనకరమని, జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని సభ్యులు పేర్కొన్నారు.దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక తహసీల్దార్ సతీష్‌కు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్తల సేకరణలో నిమగ్నమై ఉన్న విలేకరులపై దాడులు జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, బాధ్యులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.జర్నలిస్టులు నిర్భయంగా విధులు నిర్వహించేలా ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మోహన్ రాజు,ప్రధాన కార్యదర్శి భాస్కర్,దాడుల వ్యతిరేక కమిటీ సభ్యులు శ్రీనివాస్,మాజీ ప్రధాన కార్యదర్శి నర్సింలు,జిల్లా బాద్యులు సుమన్,మాజీజిల్లాసభ్యులు ,శివశరణ్సింగ్,సత్య నారాయణ,పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# దేవాలయ నిర్మాణ పనులకు శ్రీకారం..

- బేస్ మెంట్ పనులు ప్రారంభించిన మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్



**రామచంద్రపురం (పటాన్చెరు), జూన్ 23, (సిరి న్యూస్):**

జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని సింపని పార్క్ హోమ్స్ కాలనీలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సొంత నిధులతో నిర్మిస్తున్న శ్రీరామాలయం, శివాలయాల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయాల బేస్‌మెంట్ పనులను మాజీ ఎంపీపీ నాలకంటి యాదగిరి యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం భక్తుల సహకారంతో సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు కాసాల సుధాకర్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేలా ఆలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేస్తున్న కృషిని స్థానికులు అభినందించారు.

# గీతం లో సైన్స్ కోర్సులకు గాట్-2026

## మే 14లోగా దరఖాస్తులకు అవకాశం

**రామచంద్రపురం (పటాన్చెరు), జూన్ 23, (సిరి న్యూస్):**




గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ సైన్స్‌లో యూజీ, పీజీ కోర్సుల ప్రవేశాల కోసం మే 17న గీతం అడ్మిషన్ టెస్ట్ (గాట్-2026) మూడో దశను నిర్వహించనున్నట్లు స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రెజా తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.నాలుగేళ్ల బీఎస్సీ (ఆనర్స్) కోర్సులతో పాటు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ అండ్ కాగ్నిటివ్ సిస్టమ్స్, బి-ఆప్టోమెట్రీ కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. పీజీ స్థాయిలో బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, డేటా సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫిజిక్స్ విభాగాల్లో ఎమ్మెస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా అందుబాటులో ఉన్నాయని, మరిన్ని వివరాలకు www.gitam.edu వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని లేదా 888 498 4000 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని డాక్టర్ రెజా సూచించారు.

# నిజాలను వెలికి తీస్తే దాడులా.?

- జర్నలిస్టుపై దాడి హేయమైన చర్య..
- దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి.
- జిల్లా కలెక్టర్,ఎస్పీకి మెదక్ జర్నలిస్టుల వినతిపత్రాలు

**మెదక్, జూన్,23(సిరి న్యూస్)**



నార్సింగి మండల మన తెలంగాణ విలేకరి రాఘవేందర్ పై జరిగిన దాడి ఘటనను మెదక్ జిల్లా జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యగా అభివర్ణించారు. దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బాధితునితో కలిసి మెదక్ జిల్లా జర్నలిస్టులు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, టీయూడబ్ల్యూజె (143) జిల్లా నేత సురేందర్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసిన అంశంపై వార్త ప్రచురించిన నేపథ్యంలో విలేకరి రాఘవేందర్‌పై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం జర్నలిస్టుల విధి అని, తమ వృత్తి బాధ్యతలను నిర్వర్తించే మీడియా ప్రతినిధులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిందని, సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇటువంటి దాడులు జర్నలిస్టుల్లో భయాందోళనలు కలిగించడమే కాకుండా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ప్రమాదం ఉందన్నారు. రాఘవేందర్‌పై జరిగిన దాడి ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టి, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసును అత్యంత ప్రాధాన్యతగా పరిగణించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.మీడియా ప్రతినిధుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఉపేక్షించ రాదని తెలిపారు. జర్నలిస్టులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్,గోపాల్ గౌడ్, తిమ్మన్నగారి శ్రీధర్, నాగరాజు శర్మ, ఫారుక్ హుస్సేన్, బొందుగుల నాగరాజు, ముప్పనవీన్, కామాటి కృష్ణ, లక్ష్మి నారాయణ, పాపన్నపేట శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, సందీప్, గోవర్ధన్ రెడ్డి, ఖయ్యూమ్, నీలం, చల్ల రాహుల్, రాఘవులు, మల్లేష్, కార్తీక్, శ్రీహరి, సంగమేష్, రహమాత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల భూపోరాటాన్ని విజయవంతం చేయాలి.

- తెలంగాణ రక్షణ సేన పార్టీ ఉద్యమకారుల ఇంచార్జ్, రాష్ట్ర నాయకురాలు వేముల భవాని

**మెదక్,జూన్, 23(సిరి న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమని వారి హక్కుల సాధనకై పిడికిలి బిగించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా ఇంచార్జి వేముల భవాని పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ ఆదేశాల మేరకు భూ పోరాటాన్ని నిర్వహిస్తున్నామన్నారు.మంగళవారం మెదక్ టీఎన్జీవో భవన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి బట్టి అజయ్, వీరప్ప గారి రమేష్ గౌడ్ మరియు ఇతర నాయకులతో కలిసి ఉద్యమకారుల భూమి పోరాటం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 2న హైదరాబాద్ లో తలపెట్టిన ఉద్యమకారుల హక్కుల సాధనకై నిర్వహిస్తున్న ఉద్యమకారులభూమి పోరాటం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు జూలై 2న హైదరాబాద్ లో జరిగే ఈ కార్యక్రమానికి ఉద్యమకారులు పార్టీ శ్రేణులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ



కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కవిత,నర్సాపూర్ ఇంచార్జ్ అపర్ణ,చంద్రశేఖర్, రమేష్, భాను,అశోక్,నవీన్,గుండమల్లి రాజు, యోహాన్, ఉద్యమకారులు టిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి
- రైతు వేదికల్లో ఘనంగా విత్తన మేళా
- వారం రోజుల పాటు రైతులకు అవగాహన
- నాణ్యమైన విత్తనాల ప్రదర్శన
- జాతీయ ఆహార భద్రత పథకం కింద ఉచితంగా కంది విత్తనాల పంపిణీ

**గుమ్మడిదల, జూన్ 23 (సిరి న్యూస్):**

ఖరీఫ్ సాగు సీజన్‌ను పురస్కరించుకుని గుమ్మడిదల, కానుకుంట రైతు వేదికలలో సోమవారం విత్తన మేళా కార్యక్రమం ప్రారంభమైంది. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మేళా వారం రోజుల పాటు కొన్న సాగుతుంది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం సూచించిన సన్నరకాల వరి విత్తనాలతో పాటు కంది విత్తనాలు, నానో యూరియా, డి.ఏ.పీ. ఎరువులను ప్రదర్శించారు. రైతులకు ఆయా విత్తనాల ప్రత్యేకతలు, దిగుబడి సామర్థ్యం, మార్కెట్‌లో ఉన్న డిమాండ్ గురించి అధికారులు వివరించారు. ముఖ్యంగా బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, జై శ్రీరామ్, హెచ్ఎంటీ సోనా,



కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44 వంటి సన్నరకాల వరి రకాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్, మున్సిపల్ కౌన్సిలర్లు, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారి సుమిత, ఇతర అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

**సన్నరకాల సాగుతో రైతులకు అధిక లాభాలు**

సన్న రకాల సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని పటాన్‌చెరు ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచేందుకు సన్నరకాల వరి సాగును ప్రోత్సహిస్తోందన్నారు. మార్కెట్‌లో సన్నబియ్యానికి మంచి డిమాండ్ ఉండటంతో రైతులు సన్నరకాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణను అవలంబించాలని సూచించారు. వరితో పాటు కందులు, మొక్కజొన్న, కూరగాయల పంటలు, ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటలను సాగు చేయడం ద్వారా మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రకృతి పరిస్థితులు, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

**ఉచితంగా కంది విత్తనాల పంపిణీ**

జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతులకు వంద శాతం రాయితీపై కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే సూక్ష్మ పోషకాల పథకం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహక కార్యక్రమం కింద యాభై శాతం రాయితీపై కంది విత్తనాలను రైతులకు అందజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంటల విస్తీర్ణాన్ని పెంచాలని అధికారులు సూచించారు.

**కానుకుంట రైతు వేదికలో ప్రత్యేక అవగాహన**

కానుకుంట రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వందన రైతులకు సన్నరకాల వరి సాగు విధానాలు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, దిగుబడి పెంపు చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు. రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇస్తూ శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.

# వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన..

- నీటి నిల్వల తొలగింపునకు చర్యలు
- మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూన్ 23, (సిరి న్యూస్):**




నిన్న రాత్రి కురిసిన భారీ వర్షాలకు రామచంద్రాపురం డివిజన్‌లోని పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అప్రమత్తమయ్యారు. వివిధ కాలనీల ప్రజలతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకుంటూ, అవసరమైన చోట మాన్సూన్ బృందాలు, హైడ్రా సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టేలా సమన్వయం చేశారు.లోతట్టు ప్రాంతమైన రామచంద్రారెడ్డి నగర్ కాలనీలోని రోడ్డు నంబర్లు 2, 3 వద్ద వర్షపు నీరు నిలిచి అపార్ట్‌మెంట్ సెల్లార్లు, ఇళ్లు, రహదారుల్లోకి చేరినట్లు సమాచారం అందడంతో స్థానిక కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డితో కలిసి బూరుగడ్డ పుష్పనగేష్ అక్కడ పర్యటించారు. సిబ్బందితో కలిసి పరిస్థితిని పరిశీలించి, నీరు వేగంగా బయటకు వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటామని, ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే స్పందిస్తామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ప్రజల ఇబ్బందులను వెంటనే గుర్తించి సహాయక చర్యలు చేపట్టడంలో ఎల్లప్పుడూ ముందుంటామని ఆయన పేర్కొన్నారు.

# డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఘన నివాళులు!!

- శివంపేట్ బిజెపి నాయకులు.!!

**శివంపేట జూన్ 23 (సిరి న్యూస్ )**

శివ్వంపేట మండలంలోని భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా అనే లక్ష్యంతో కాశ్మీర్ కోసం ప్రాణాలర్పించిన భారతీయ జనసంఘ వ్యవస్థాపకులు, ప్రాతః స్మరణీయులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ మండల అధ్యక్షులు పెద్దపులి రవి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వెంకన్నగారి కొండల్ రావు, జిల్లా కార్యదర్శిలు అశోక్ సాదుల, ఎరుకల భిక్షపతి, సీనియర్ నాయకులు గుల్లయ్యగారి సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి నారాయణ గారి వినోద్, మండల ఉపాధ్యక్షులు మామిడి నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుంది

## ముగింపు దశలో ధాన్యం కొనుగోళ్లు.

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**మెదక్,జూన్, 23(సిరి న్యూస్)**

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ముగింపు దశలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ అన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 95, 313 మంది రైతుల నుండి 4,21,083,240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,90,221 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాలో 928.85 కోట్ల రూపాయలు చెల్లింపు చేశామన్నారు.ఇప్పటివరకు 531 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేశామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# కిసాన్ సీడ్ మేళాలో రైతులకు విత్తనాల పంపిణీ



**మునిపల్లి, జూన్ 23 (సిరి న్యూస్):**

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జూన్ 23 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న కిసాన్ సీడ్ మేళా కార్యక్రమంలో భాగంగా మునిపల్లి మండలంలోని బుధేరా రైతు వేదికలో మంగళవారం రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు కందులు, పెసర్లు, మినుములు, సోయా విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వినోద్ కుమార్, ఏడీఏ సత్యనారాయణ, ఏఓ అనిత, ఏఈఓలు, పోల్కంపల్లి సర్పంచ్ వీరేశం, ఉప సర్పంచ్ ఆనంద్, వ్యవసాయ అధికారి రెహ్మాన్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, యూత్ అధ్యక్షుడు ఎల్ల గౌడ్, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అవగాహన



**తూప్రాన్ జూన్ 23 సిరి న్యూస్**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో మంగళవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై గ్రామసభ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు జూన్ 25 నుండి జూలై 24 వరకు ఇంటింటి సర్వే కొనసాగుతుందని తూప్రాన్ తసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు అన్హారులను తొలగించి అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చడం జరుగుతుందన్నారు ఈ ప్రక్రియలో ఓటర్లు బిఎల్ఓ లకు సహకరించాలని తహసిల్దార్ కోరారు ప్రతి ఓటర్ కు బి ఎల్ ఓ లు దరఖాస్తు ఫారాలను ఇంటింటికి అందజేస్తారని ఇంటి పేరుతో సహా తప్పులు లేకుండా దరఖాస్తు ఫారాలను స్వయంగా నింపి సంతకం చేసి ప్రతి ఓటర్ బి ఎల్ ఓ లకు అందజేయాలన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్ సంతోష్ జిపిఓ విజయలక్ష్మి, బి ఎల్ ఓ సంతోష పాలకవర్గ సభ్యులు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# నాణ్యతలేని రోడ్డు వల్ల మట్టిలో కూరుకుపోయిన సిమెంట్ లారీ






**మునిపల్లి, జూన్ 23 (సిరి న్యూస్):**

మునిపల్లి మండలం లింగంపల్లి శివారులోని జాతీయ రహదారిపై నాణ్యతలేని అదనపు రోడ్డు (మట్టి రోడ్డు) కారణంగా రామ్‌కో సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ మట్టిలో కోరుకుపోయింది.డ్రైవర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న AP 39 UQ 4685 నంబర్ గల రామ్‌కో సిమెంట్ లారీని అత్యవసర కాలకృత్యాల కోసం ఆపారు. అనంతరం లారీని కదిలించే సమయంలో నాణ్యతలేని అదనపురోడు భాగంలో చక్రాలు కూరుకుపోయి లారీ ఇరుక్కుపోయింది.మూడు రోజుల పాటు లారీని బయటకు తీయలేకపోయారని, చివరకు లారీలో ఉన్న సిమెంట్ లోడ్‌ను మరో లారీకి షిఫ్ట్ చేసిన తర్వాత క్రేన్ సహాయంతో వాహనాన్ని బయటకు తీసినట్లు డ్రైవర్ తెలిపారు. ఈ ఘటన కారణంగా ఆలస్యం, లోడ్ షిఫ్టింగ్, ఇతర నిర్వహణ ఖర్చులతో కలిపి దాదాపు రూ.40 వేల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.టోల్ రుసుము వసూలు చేస్తున్నప్పటికీ రహదారి నాణ్యత సరిగా లేకపోవడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, సంబంధిత అధికారులు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

# యువత వ్యసనాలకు బానిసైతే భవిష్యత్తు అగమ్యం..!

- **చెడు స్నేహాలు – మత్తు పదార్థాలు**
- **నిర్లక్ష్య పర్యవేక్షణే ప్రధాన కారణాలు**
- **అప్రమత్తంగా ఉంటేనే యువతను వ్యసనాల బారినుంచి కాపాడగలం**
- **మత్తు మాయలో యువత ప్రమాదంలో భవిష్యత్తు**
- **వ్యసనాల వలలో చిక్కుకుంటున్న యువతరం**

**గుమ్మడిదల, జూన్ 23( సిరి న్యూస్ ) :**




ప్రస్తుతం సమాజం ఆధునికత వైపు వేగంగా పరుగులు తీస్తున్న వేళ, మరోవైపు యువతలో విలువలు క్షీణించడం, చెడు అలవాట్ల పట్ల ఆకర్షణ పెరగడం ఆందోళన కలిగిస్తోంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులపై వ్యసనాల వల విసరబడుతుండగా, పదో తరగతి దాటక ముందే కొందరు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్ దశల్లో ధూమపానం, మద్యపానం వంటి అలవాట్ల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని వైద్యులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. యువతలో వ్యసనాల పట్ల పెరుగుతున్న ఆకర్షణ దేశవ్యాప్తంగా ఆందోళనకు గురిచేస్తోందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

### చెడు స్నేహాలే మొదటి అడుగు

యుక్తవయసులో స్నేహితుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఎంజాయ్‌మెంట్, స్టైల్, సాహసం పేరుతో మొదలయ్యే అలవాట్లు క్రమంగా వ్యసనాలుగా మారుతున్నాయి. ఒకసారి మత్తు పదార్థాల ప్రపంచంలోకి అడుగుపెట్టిన వారు తిరిగి బయటపడడం కష్టమవుతోంది. గుర్తింపు కోసం, స్నేహితుల్లో ప్రత్యేకంగా కనిపించాలనే తపనతో అనవసర సాహసాలకు యువత సిద్ధపడుతున్నారు.

### హీరోల అనుకరణ.. ప్రమాదకర ధోరణి

సినిమా హీరోలు, సోషల్ మీడియా ప్రభావంతో కొందరు యువకులు ధూమపానం, మద్యపానాన్ని స్టైల్‌గా భావిస్తున్నారు. అభిమాన హీరోలను అనుకరిస్తూ సిగరెట్లు తాగడం, ప్రమాదకర సాహసాలు చేయడం గర్వకారణంగా భావిస్తున్నారు. అయితే ఈ అలవాట్లు ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా భవిష్యత్తును కూడా దెబ్బతీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యువతను ఆకర్షించే విధంగా ధూమపాన ఉత్పత్తుల ప్రచారం కొనసాగుతుండటం కూడా సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

### డబ్బు అందుబాటులో ఉంటే మత్తుకు మరింత చేరువ

ఆర్థికంగా బలమైన కుటుంబాలకు చెందిన కొందరు విద్యార్థులు తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. బార్లు, బీర్లు, పార్టీల పేరుతో స్నేహితులను తమ చుట్టూ ఉంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో స్నేహితులు కూడా అదే అలవాట్లకు లోనవుతూ వ్యసనాల బారిన పడుతున్నారు.

### గుమ్మడిదలలో టీ బండ్లే అడ్డాలుగా..!

గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతంలో సాయంత్రం అయ్యిందంటే చాలాచోట్ల టీ బండ్ల వద్ద యువకులు గుమిగూడి ధూమపానానికి అలవాటు పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కొందరు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. పోలీసులు తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు యువకులు హెచ్చరికలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### తల్లిదండ్రుల పర్యవేక్షణ అత్యవసరం

పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను తల్లిదండ్రులు నిశితంగా గమనించాలి. తరచూ ఎక్కువ డబ్బులు అడగడం, ఇంటికి ఆలస్యంగా రావడం, ఒంటరిగా గడపడం, కోపంగా ప్రవర్తించడం, చదువుపై ఆసక్తి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. హాస్టళ్లు, ప్రైవేట్ గదుల్లో ఉంటున్న విద్యార్థులను అప్పుడప్పుడు ఆకస్మికంగా సందర్శించి వారి పరిస్థితిని తెలుసుకోవడం అవసరం. పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వ్యసనాల బారిన పడకుండా కాపాడవచ్చు.

### సాంకేతికత మంచికే కాదు.. చెడుకూ మార్గం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంత మేలు చేస్తుందో, దాన్ని తప్పుగా వినియోగిస్తే అంతే నష్టం కూడా కలిగిస్తుంది. సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్రభావాలు, తప్పుడు ప్రచారాలు యువతను మత్తు పదార్థాల వైపు ఆకర్షించే అవకాశాలు పెరుగుతున్నాయి. అందువల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి యువతకు సరైన మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం ఉంది.

### అప్రమత్తతే రక్షణ

యుక్తవయసులో చెడు వ్యసనాలకు బానిస కాకుండా యువతను కాపాడే బాధ్యత ప్రధానంగా తల్లిదండ్రులపైనే ఉంది. పిల్లలతో సన్నిహితంగా ఉంటూ, వారి స్నేహితులు, అలవాట్లు, ఖర్చులపై పర్యవేక్షణ కొనసాగిస్తే వ్యసనాల బారిన పడకుండా కాపాడవచ్చు. ఒక్కసారి అలవాటు పడితే బయటపడటం కష్టం అని వైద్యులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. అందుకే యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తుకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.




# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువతే కీలక శక్తి

- **వ్యసనాలకు కాదు.. లక్ష్య సాధనకు అడుగులు వేయాలి.**
- **డ్రగ్స్‌కు దూరంగా.. క్రీడలకు చేరువగా ఉండాలి.**
- **జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.**

**మెదక్,జూన్, 23(సిరి న్యూస్)**





యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ క్రీడలు, విద్య, ఉన్నత లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా పోలీసు శాఖ డ్రగ్స్ నిర్మూలనపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.ఇందులో భాగంగా మెదక్ పట్టణ సీఐ మహేష్ ఆధ్వర్యంలో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించే లక్ష్యంతో మంగళవారం వన్–డే క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో యువ జనాభా అత్యధికంగా ఉందని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అన్నారు. యువత తమ శక్తి, సామర్థ్యాలను సానుకూల దిశలో వినియోగిస్తే దేశాభివృద్ధికి బలమైన శక్తిగా నిలుస్తారని పేర్కొన్నారు.ప్రస్తుత కాలంలో మాదకద్రవ్యాలు యువత జీవితాలను, కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్షణిక ఆనందం కోసం డ్రగ్స్ వైపు అడుగులు వేయడం జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుందని, ఒకసారి వాటికి బానిసైతే ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు, కుటుంబ బంధాలు, వ్యక్తిత్వం అన్నీ దెబ్బతింటాయని హెచ్చరించారు.

### "డ్రగ్స్‌కు 'నో' చెప్పండి... క్రీడలకు 'ఎస్' చెప్పండి"

అనే సందేశాన్ని ప్రతి యువకుడు జీవితంలో ఆచరించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, జీవితంలో విజయాలను అందుకోవడానికి క్రీడలు కూడా ఒక మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు.మెదక్ జిల్లా పోలీసు శాఖ డ్రగ్స్ నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు, క్రీడా పోటీలు, విద్యాసంస్థల్లో చైతన్య సదస్సులు నిరంతరం నిర్వహిస్తోందని, ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించి డ్రగ్స్ రహిత మెదక్ జిల్లాను నిర్మించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ యువతతో కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీ ప్రసన్న కుమార్,మెదక్ టౌన్ సీఐ మహేష్, పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు, యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డబ్బు కోసం అమ్మమ్మను చంపిన మనవడు

- **స్నేహితుడితో కలిసి గొంతు నులిమి హత్య..**

**రామాయంపేట, జూన్ 23 (సిరి న్యూస్)**



అమ్మమ్మ అంటే ప్రాణంగా చూసుకోవాల్సిన మనవడు.. బైక్ వ్యామోహంలో పడి సొంత అమ్మమ్మనే కడతేర్చాడు. ఆస్తి కోసం కాదు, కేవలం ఒక బైక్ కొనడం కోసం సొంత అమ్మమ్మను హత్య చేసిన దారుణ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతురాలు సాయమ్మ (65) తన ఇంట్లో ఉండగా, ఈ నెల 18న ఉదయం అపస్మారక స్థితిలో కనిపించింది. నోటి నుండి నురగలు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. వయసు, అనారోగ్య కారణాలతో సహజ మరణం అని భావించిన కుటుంబీకులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అంత్యక్రియల సమయంలో మృతదేహాన్ని చితిపై ఉంచుతుండగా, సాయమ్మ మెడపై ఉన్న గాట్లు కుటుంబ సభ్యులకు అనుమానం



కలిగించాయి. దీనిపై ఆరా తీయగా, సంఘటన జరిగిన రాత్రి సాయమ్మ మనవడు (చిన్న కూతురు లక్ష్మి కుమారుడు) విశాల్, తన స్నేహితుడు ప్రశాంత్‌తో కలిసి ఇంటికి వచ్చినట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటపడ్డాయి. బైక్ కొనడం కోసం డబ్బు అవసరమై విశాల్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తేలింది. నిందితుడు మొదట సాయమ్మ తాగే పానీయంలో నిద్రమాత్రలు కలిపి ఆమెను మత్తులోకి దించాడు. అనంతరం ఆమె వద్ద ఉన్న తాళం చెవుల కోసం ప్రయత్నించగా, సాయమ్మ మేల్కొంది. దీంతో విశాల్, తన స్నేహితుడు ప్రశాంత్‌తో కలిసి సాయమ్మ గొంతు నులిమి, నోరు అదిమి దారుణంగా హత్య చేశారు.అనంతరం ఆమె ఒంటిపై ఉన్న రెండు చెవి కమ్మలు, ఒక ఉంగరం దోచుకుని హైదరాబాద్‌కు పారిపోయారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, మంగళవారం నాడు రిమాండ్‌కు తరలించారు. పిల్లల ప్రవర్తన, వారి అలవాట్లపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని, లేని పక్షంలో ఇలాంటి దుర్మార్గాలు జరిగే ప్రమాదం ఉందని రామాయపేట సిఐ సైదా హెచ్చరించారు.

# గూడూరులో శ్రీ గురుపీఠం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభం.!

- **దత్తాత్రేయ పంచాయతనం, గురుపరంపర ప్రతిష్ఠలతో ఆధ్యాత్మిక శోభ!!**
- **వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించిన శ్రీ గురు పీఠం ట్రస్ట్ సభ్యులు!!!**



**శివంపేట జూన్ 23 ( సిరి న్యూస్ )**

శివ్వంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలోని శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ గురుపీఠంలో ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం, కలియుగ దత్తావతారుల గురుపరంపరలోని శ్రీ వేదవ్యాస మహర్షి, శ్రీ దక్షిణామూర్తి, శ్రీ ఆది శంకరాచార్యులు, శ్రీ గజానన మహారాజ్, శ్రీ వాసుదేవానంద సరస్వతి, శ్రీ సాయినాథ మహారాజ్, శ్రీ కృష్ణతులసి, శ్రీ సమర్థ రామదాసు, శ్రీధర మహారాజ్ విగ్రహాలతో పాటు పంచవటి ఆది వృక్షాలు, శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా చేపట్టారు.షిరిడి సాయిబాబా దేవాలయ పురోహితులు శాస్త్రుల వామన్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ గురుపీఠం ఫౌండర్, ట్రస్ట్ చైర్మన్ పెద్దగౌని శివకుమార్ గౌడ్ దంపతులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం సంకల్పం, మహాగణపతి పూజ, పుణ్యాహ వాచనం, ఋత్విక్ వరణం, పంచగవ్య ప్రాశనం, నవగ్రహ–వాస్తు మండప ప్రతిష్ఠ, ప్రధాన దేవతా మండపం, సర్వతోభద్ర మండప స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం దత్తాత్రేయ స్వామి, సాయిబాబా మూలమంత్ర హోమాలు, నవగ్రహ హోమం, వాస్తు హోమం, సర్వతోభద్ర మండప హోమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోష మహాపూజ, విశేష హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.వార్షికోత్సవ వేడుకల సందర్భంగా శ్రీ గురుపీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. గురుభక్తి, సనాతన ధర్మ ప్రచారం, ఆధ్యాత్మిక చైతన్య విస్తరణ లక్ష్యంగా ఏర్పాటైన ఈ గురుపీఠం ప్రాంతంలో ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సభ్యులు పెద్దగౌని శివకుమార్ గౌడ్, ట్రస్ట్ చైర్మన్ రమాదేవి, సూర్యంకుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, వై. రాజారమణ గౌడ్, పబ్బ మహేష్ గుప్తా, మారెళ్ల మోహన్‌రావు, నోముల హనుమంతు, రాజ్యం బిక్షపతి, శాస్త్రుల వామన్ శర్మ, శ్రీహర్ష శర్మ, నటరాజ్ శర్మ, గ్రామ సర్పంచ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# వేద విద్య ప్రవేశ పరీక్షకు విశేష స్పందన..!

- **తొలి విడతలో 68 మంది విద్యార్థుల హాజరు**
- **త్వరలో రెండో విడత పరీక్ష**

**ఝరాసంఘం, జూన్23(సిరిన్యూస్)**

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ వేద పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి విద్యార్థుల ప్రవేశాల కోసం నిర్వహించిన తొలి విడత మౌఖిక పరీక్ష మంగళవారం విజయవంతంగా జరిగింది. పరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 98 మంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం నిర్వహించిన మౌఖిక పరీక్షకు తెలుగు మంచిర్యాల, బెల్లంపల్లి, హైదరాబాద్, నారాయణఖేడ్, కరీంనగర్, కల్వకుర్తి, పెద్దపల్లి, నిర్మల్, వికారాబాద్, కామారెడ్డి, ఆమనగల్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, గిరవెల్లి, నిర్మల్, జహీరాబాద్ తో పాటు మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 68 విద్యార్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. వేద విద్యపై ఆసక్తి కలిగిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమని ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. త్వరలోనే మరో విడత మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఈ పరీక్షలు రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్య స్వామి, నందిని గిరి, పర్యవేక్షణలో జరిగింది. అన్ని



వర్ణాల వారు వేద విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 8639258008, 9177259329 లేదా నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# చెత్త నిర్వహణ నియమాలపై అవగాహన కల్పించిన మండల అధికారులు!!

**శివంపేట జూన్ 23 ( సిరి న్యూస్ )**

శివంపేట మండలంలోని శివ్వంపేట గ్రామ పంచాయతీ లో ఎస్డబ్ల్యూఎం లో భాగంగా 4రకాల చెత్త నిర్వహణ నియమాలు– 2026 ప్రకారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రతి ఇంటి నుండి గ్రామపంచాయతీ ట్రాక్టర్కు ఇచ్చే చెత్తను నాలుగు రకాలుగా విభజించి,అనగా గ్రీన్ బుట్టలో తడి చెత్తకూరగాయలు వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, తినే వస్తువులు ఏవైనా మిగిలిపోయినవి, భూమి లో కరిగేటివి,కుళ్లిపోఏటివి మొదలగునవి.నీలి రంగు బుట్ట తో పొడి వ్యర్థాలుప్లాస్టిక్ వస్తువులు ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ బాటిల్స్ అట్టముక్కలు పుస్తకాలు బట్ట ముక్కలు గాజు సీసాలు ఇనుప వస్తువులు మొదలగునవి ఎరుపు రంగు బుట్ట తో శానిటరీ చెత్తడ



యాపర్లు.సానిటరీ నాప్కిన్స్.మెడికల్ వాడిన వస్తువులు పేపర్ తో చుట్టి ఇచెట్టు మొదలగునవి.నలుపు రంగు బుట్ట తో ప్రత్యేక/హానికరబల్బులు.బ్యాటరీలు.మందులు.ఈ–వేస్ట్.పేయింట్లు.ఇతర హానకర పదార్థాలుపైవిధంగా నాలుగు రకాలుగా వేరు చేసిన చెత్తను గ్రామపంచాయతీ ట్రాక్టర్ సిబ్బందికి ఇచ్చినచో వారు అట్టి వాటిని సిగ్రిగేషన్ షెడ్ వద్దకు తరలించి అట్టి వాటిని వేరు వేరు గా నిర్వహించుటకు వీలుపడునని గ్రామాల లో కుడా పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని అందరు కూడా పై పద్ధతులు అనుసరిస్తూ గ్రామపంచాయతీకి సహకరిస్తే గ్రామ ప్రజలు ఆరోగ్యవంతంగా మరియు గ్రామం కూడా పరిశుభ్రంగా ఉండుటకు వీలుపడునని ఇట్టి అవగాహన సదస్సులో వివరించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్ మరియు డివిజనల్ పంచాయతీ అధికారి సురేష్ బాబు ఎంపీడీవోవిజయ లక్ష్మమ్మ ,ఎం పి ఓ తిరుపతిరెడ్డి ఏపీఎం పెంటాగౌడ్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఐకెపి సిసి లు నరసింహ గౌడ్,పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడి టీచర్ మరియు వివో లు గ్రామ నాయకులు మరియు మహిళా సంఘాల మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు అభివృద్ధిపై మంత్రి వివేక్ ఫోకస్..

- **రూ.60 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం..**
- **బాధిత కుటుంబానికి మంత్రి భరోసా..**
- **పాఠశాల అభివృద్ధికి అధికారులకు ఆదేశాలు..**
- **మిషన్ భగీరథపై వివేక్ విమర్శలు..**



**మంచిర్యాల, జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ జూన్ 23 ( సిరి న్యూస్ )**

మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో గ్రామీణాభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శ్రీకారం చుట్టారు. కోటపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సదుపాయాలు, తాగునీటి వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కోటపల్లి మండలంలోని లింగన్నపేట, ఎదులబంధం, రొయ్యలపల్లి, అలుగామ, జనగామ గ్రామాల్లో సుమారు రూ.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే గ్రామాల రూపురేఖలు మారడంతో పాటు ప్రజల రాకపోకలకు, పారిశుద్ధ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. అనంతరం వెంచపెల్లి గ్రామంలో ఇటీవల ప్రాణహిత నదిలో పడి మృతి చెందిన పబ్బా అజయ్ గౌడ్ కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తర్వాత ఎదులబంధం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన మంత్రి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు అదనపు తరగతి గదుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్, మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు కొత్త రేషన్ కార్డులు అందలేదని ఆరోపించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన కుటుంబాలకు నిరంతరంగా రేషన్ కార్డులు అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పంపిణీతో నిరుపేద కుటుంబాల్లో ఆనందం నెలకొందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పథకంపై కూడా విమర్శలు గుప్పించిన మంత్రి, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రజలకు తాగునీరు అందలేదని ఆరోపించారు. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు..





# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత..

## సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్!!!



**కొండాపూర్ జూన్ 23 ( సిరి న్యూస్ )**

వన మహోత్సవం సందర్భంగా గొల్లపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అందరి బాధ్యత అని వారు తెలిపారు. పచ్చదనం పెంపొందితే స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామాన్ని మరింత హరితవనంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రియాంక నర్సిములు, పంచాయతీ కార్యదర్శి,వార్డ్ సభ్యులు,సీనియర్ మేట్ మాణిక్ రెడ్డి,గ్రామ ప్రజలు, యువకులు,పాల్గొన్నారు.

# ఉద్యమకారుల భూ పోరాటం

## ఉద్యమకారులకు అండగా తెలంగాణ రక్షణ సేన



**నర్సాపూర్ జూన్ 23 (సిరి న్యూస్)**

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో జూలై 2న హైదరాబాద్ పట్టణంలో ఉప్పల్ నిర్వహించనున్న "ఉద్యమకారుల భూమి పోరాటం" కార్యక్రమం సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పత్రిక సమావేశం జరిగింది సమావేశానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా ఉద్యమకారుల ఇంచార్జ్ వేముల భవాని, శివశంకర్ జిల్లా ఇంచార్జ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమంలో పాల్గొని పోలీస్ స్టేషన్లో కేసులు అనుభవించి ఎన్నో ఇబ్బందులు పడ్డారని వారిని గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని ఉద్యమకారుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న "ఉద్యమకారుల భూమి పోరాటం" కార్యక్రమాన్ని ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి నాయకురాలు కవిత మెదక్ నియోజకవర్గం ఇన్చార్జ్ రమేష్ నర్సాపూర్ టీఆర్ఎస్ నాయకురాలుఅపర్ణ,నియోజకవర్గ టీఆర్ఎస్ నాయకులు రమేష్ , రమేష్ సీనియర్ కళాకారులు సాయిలు, అల్లం పాపయ్య సాయిలు పార్టీ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో విత్తన మేళ

**వెల్దుర్తి, జూన్ 23 ( సిరి న్యూస్) :**



వెల్దుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలలో మంగళవారం రైతుల కోసం విత్తన మేళా నిర్వహించారు. స్థానిక రిటైల్ విత్తన విక్రయ దారులు పాల్గొని తమ వద్ద అందుబాటులో ఉన్న ప్రభుత్వ నోటిఫైడ్ విత్తన రకాలను రైతులకు ప్రదర్శించి, వాటి వివరాలను తెలియజేశారు. రైతులకు నాణ్యమైన, ధృవీకరించబడిన విత్తనాల లభ్యతపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన విత్తనాలను కొనుగోలు చేసుకునే అవకాశం కూడా కల్పించడం జరిగిందని ఏవో ఝాన్సీ పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందుబాటులోకి తీసుకురావడంలో విత్తన మేళా ఉపయోగకరంగా నిలిచిందని అన్నారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా వివిధ పంటల విత్తనాల గురించి సమాచారం తెలుసుకొని, అవసరమైన విత్తనాలను కొనుగోలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో ఝాన్సీ, ఏఈఓ మజీద్, విత్తన డీలర్లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య...నాణ్యమైన భోజనం..

## జిల్లా విద్యాధికారి రాజు

**వెల్దుర్తి, జూన్ 23, (సిరి న్యూస్):**



ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం లభిస్తుందని మెదక్ జిల్లా విద్యాధికారి రాజు అన్నారు. మంగళవారం ఆయన వెల్దుర్తి మండల పరిధిలోని చేరిల్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ప్రీ ప్రైమరీ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన అలాగే పిల్లలకు నాణ్యమైన భోజనము అందుతుందని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని, బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.ఆయన వెంట గ్రామ సర్పంచ్ రవి లావణ్య, ఉప సర్పంచ్ నవీన్ యాదవ్, మండల విద్యాధికారి బుచ్చా నాయక్, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఫరీద్, భవాని, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలకు వెలుగు నింపిన చేతులు- నేడు చీకటిలోనే

**మెదక్ జూన్ 23 సిరి న్యూస్**

జోగిపేట కేంద్రంగా 1982 సంవత్సరంలో ప్రారంభమైన సంజయ్ రూరల్ ఎలక్ట్రిసిటీ కో–ఆపరేటివ్ సొసైటీ (సంజయ్ రెస్కో) ఒకప్పుడు గ్రామీణ విద్యుత్ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన సంస్థ. విద్యుత్ సౌకర్యాలు గ్రామాలకు పూర్తిస్థాయిలో అందని రోజుల్లో రైతులకు, గ్రామీణ ప్రజలకు విద్యుత్ వెలుగులు అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థ తన సేవా ప్రస్థానాన్ని ప్రారంభించింది. జోగిపేట, శంకరంపేట కేంద్రాలుగా ఏర్పాటైన ఈ సంస్థ పరిధిలో పుల్కల్, పాపన్నపేట, టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడు, శంకరంపేట తదితర మండలాల్లోని వందలాది గ్రామాలకు విద్యుత్ సేవలు అందించబడేవి. గ్రామాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ వరకు, రైతులకు వ్యవసాయ కనెక్షన్ల మంజూరు నుంచి విద్యుత్ లోపాల సవరణ వరకు ప్రతి బాధ్యతను ఈ సంస్థ ఉద్యోగులే భుజాన వేసుకున్నారు.అప్పట్లో విద్యుత్ సౌకర్యాలు కల్పించడం నేటిలా సులభం కాదు. మట్టి రోడ్లు, దూర ప్రాంత గ్రామాలు, అడవులు, వాగులు, వంకలు దాటి విద్యుత్ లైన్లు వేయాల్సి వచ్చేది. భారీ వర్షాలు, తుఫానులు, పిడుగులు పడిన సందర్భాల్లో విద్యుత్ లైన్లు తెగిపోతే రాత్రింబవళ్లు కష్టపడి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేవారు. గ్రామాల్లో ఒక బల్బు వెలిగినా, రైతు బావిలో మోటార్ తిరిగినా, దాని వెనుక రెస్కో ఉద్యోగుల శ్రమ ఉండేది. ప్రజల అవసరాలే తమ బాధ్యతగా భావించి పనిచేసిన ఈ ఉద్యోగులు గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.సంస్థలో మొత్తం సుమారు 150 మంది ఉద్యోగులు వివిధ హోదాల్లో పనిచేశారు. లైన్‌మెన్లు, హెల్పర్లు, టెక్నికల్ సిబ్బంది, క్లర్కులు, సూపర్‌వైజర్లు ఇలా అనేక మంది తమ జీవితాలను ఈ సంస్థ అభివృద్ధికి అంకితం చేశారు. ప్రజల సేవ కోసం తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, పండుగలు, సెలవులు మరిచి విధులు నిర్వహించారు. విద్యుత్ శాఖలో ఒక ప్రత్యేక సేవా భావంతో పనిచేసిన ఈ ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ విస్తరణకు బలమైన పునాది వేశారు.కాలక్రమేణా విద్యుత్ రంగంలో సంస్కరణలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఈ క్రమంలో 2005 సంవత్సరంలో సంజయ్ రెస్కో విద్యుత్ శాఖలో విలీనం చేయబడింది. విలీనం జరిగిన సమయంలో ఉద్యోగుల్లో కొత్త ఆశలు చిగురించాయి. తమ సేవా కాలానికి గుర్తింపు లభిస్తుందని, ప్రభుత్వ ఉద్యోగులతో సమాన హక్కులు దక్కుతాయని, భవిష్యత్తు భద్రంగా ఉంటుందని వారు భావించారు. అయితే ఆ ఆశలు పూర్తిస్థాయిలో నెరవేరలేదని ఉద్యోగులు చెబుతున్నారు.విలీనం సమయంలో ఉన్న 150 మంది ఉద్యోగుల్లో 77 మంది పూర్తిస్థాయి రెగ్యులరైజేషన్ లేకుండా మిగిలిపోయినట్లు ఉద్యోగుల వాదన. అనంతరం కొంతమందికి కన్సల్టెంట్ విధానంలో అవకాశాలు కల్పించబడ్డాయి. సుమారు 30 మందికి ఆ విధంగా చెల్లింపులు జరిగాయని చెబుతున్నారు. కానీ 44 మంది కార్మికులు మాత్రం ఎటూ కాకుండా మిగిలిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ కొందరు పదవీ విరమణ చేశారు. కొందరు మరణించారు. నేడు ఆ 44 మందిలో కేవలం 24 మంది మాత్రమే శాఖలో వివిధ విధుల్లో కొనసాగుతున్నారని సమాచారం.ఈ 24 మంది ఉద్యోగులు గత రెండు దశాబ్దాలుగా రెగ్యులర్ ఉద్యోగులతో కలిసి విధులు నిర్వహిస్తున్నప్పటికీ, తమకు సమాన వేతనాలు, సమాన సర్వీస్ బెనిఫిట్స్, సమాన పదోన్నతులు, సమాన ఉద్యోగ భద్రత లభించడం లేదని చెబుతున్నారు. ఒకే పని చేస్తున్నప్పటికీ హోదాలో, వేతనంలో, ప్రయోజనాల్లో వ్యత్యాసాలు ఉండటం తమను తీవ్రంగా బాధిస్తున్న అంశమని పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖలోనే పనిచేస్తూ, అదే బాధ్యతలు నిర్వర్తిస్తూ, అదే ప్రమాదాలను ఎదుర్కొంటూ వచ్చినప్పటికీ తమ సేవలకు పూర్తి గుర్తింపు దక్కలేదనే భావన వారిలో ఉంది.ఇప్పటికే పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని సహోద్యోగులు చెబుతున్నారు. దశాబ్దాల పాటు ప్రజలకు విద్యుత్ సేవలు అందించిన వారు నేడు పెన్షన్ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధాప్యంలో వైద్య ఖర్చులు పెరుగుతున్నాయి. కుటుంబ బాధ్యతలు తగ్గలేదు. పిల్లల చదువులు, వివాహాలు, కుటుంబ పోషణ కోసం ఎన్నో కష్టాలు పడాల్సి వస్తోందని మాజీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అప్పులపాలయ్యారని, మరికొందరు కుటుంబ సభ్యులపై ఆధారపడే పరిస్థితికి చేరుకున్నారని చెబుతున్నారు.ప్రస్తుతం విధుల్లో ఉన్న 24 మంది ఉద్యోగులు తమను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 2005లో విలీనం జరిగిన నాటి నుంచి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పరిగణించి వేతనాలు, సర్వీస్ బెనిఫిట్స్, పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రత్యేక పెన్షన్ పథకం అమలు చేసి నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరుతున్నారు.గ్రామాలకు వెలుగు అందించేందుకు తమ యవ్వనాన్ని అంకితం చేసిన ఉద్యోగులు నేడు తమ జీవితాల్లో వెలుగులు కోసం ఎదురుచూడటం కాలం చేసిన వ్యంగ్యమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడితే గ్రామ ప్రజల ఆశలన్నీ రెస్కో ఉద్యోగులపైనే ఉండేవి. నేడు అదే ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వైపు ఆశగా చూస్తున్నారు.జోగిపేట నుంచి శంకరంపేట వరకు, పుల్కల్ నుంచి పాపన్నపేట వరకు, టేక్మాల్ నుంచి అల్లాదుర్గం వరకు వేలాది కుటుంబాల జీవితాల్లో వెలుగు నింపిన సంజయ్ రెస్కో ఉద్యోగుల సేవలను గుర్తించి వారికి న్యాయం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నాలుగు దశాబ్దాల సేవా చరిత్ర, వేలాది గ్రామీణ కుటుంబాల అభివృద్ధికి చేసిన కృషి, ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన జీవితం—ఇవన్నీ ఒక అధికారిక ఫైల్‌లోని సంఖ్యలుగా కాకుండా ఒక తరం చేసిన సేవగా గుర్తించాలని కోరుతున్నారు.గ్రామాల్లో చీకట్లను పారద్రోలిన ఆ చేతులకు న్యాయం జరిగే రోజు కోసం నేడు రెస్కో ఉద్యోగుల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. ఒకప్పుడు ఇతరుల ఇళ్లలో వెలుగులు నింపిన ఆ ఉద్యోగుల జీవితాల్లో కూడా ప్రభుత్వం ఆశాకిరణం నింపాలని, వారి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలని, పెన్షన్ భరోసా కల్పించాలని, మిగిలిన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని గౌరవప్రదమైన పెన్షన్ అందించడం ద్వారా ప్రభుత్వం న్యాయం చేయాలని ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు

# నా రాజ్యసభ సీటునే చోరీ చేసారు....

- **ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్**
- **రాష్ట్రంలో బీఆర్ఎస్ పని ఖతం: పీసీసీ అధ్యక్షుడు**
- **అల్మాయిపేటలో బీఎల్ఏలకు ఎస్ఐఆర్‌పై అవగాహన**

**జోగిపేట,జూన్ 23, (సిరి న్యూస్):**






మధ్య ప్రదేశ్‌లో ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్‌తో చేతులు కలిపి నా నామినేషన్‌ను తిరస్కరించి సీటును చోరీ చేసారని ఐసీసీ తెలంగాణా రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. సంగారెడ్డి జిల్లా అందోలు నియోజకవర్గం పరిధిలోని సంగుపేటలోని లక్ష్మిదేవి గార్డెన్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ పై బీఎల్ఏలకు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓట్ చోరీ, సీటు చోరీ అయిపోయిందని ఇక ఏదో రకంగా రాష్ట్రాలను చేజిక్కించుకోవాలన్నదే బీజేపీ ఉద్దేశమన్నారు. స్పెషల్ ఇంటన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) ‡విధానంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు రాజకీయాలకు తెరలేపిందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కును తొలగించడం మానవ హక్కుల ఉల్లంఘనేనని ఆమె అన్నారు. 2028లో ఎన్నికలుంటే ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఉద్దేశ్యంతో ఇప్పటి నుంచే ఓటరు జాబితాను సిద్ధం చేస్తుందన్నారు. ఓటు చోరీతో పాటు సీటు చోరీకి పాల్పడిందని, మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ స్థానానికి తాను వేసిన నామినేషన్‌ను ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై నామినేషన్‌ను తిరస్కరించి సీటు చోరీకి పాల్పడిందని ఆమె విమర్శించారు.

**రాష్ట్రంలో బీఆర్ఎస్ పని ఖతం: పీసీసీ అధ్యక్షుడు**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తప్ప మరో పార్టీకి స్థానం లేదని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్ పార్టీదే విజయమని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. ఎన్నికల్లో ప్రజలికిచ్చిన వాగ్ధానాలలో 70 శాతం నేరవేర్చామని, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ వంటి ఇతరత్రా వాటిని అమలు చేస్తున్నామన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అక్రమాలు, అరాచకలు, భూదోపిడి, నీళ్ల దోపిడిని ప్రజలు ఇంకా మరిచిపోలేరని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని చెప్పుకొవడం మీ భ్రమేనన్నారు.

**అర్హులైన ఓట్లు పోకుండా చూడాలి: మంత్రి దామోదర్**

కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్ఐఆర్ విధానంతో అర్హత కలిగిన వారి ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చూసుకునే బాధ్యత బీఎల్ఏ లదేనని రాష్ట్ర ◌ÐÒ ద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహా అన్నారు. దేశ వ్యాప్తంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 8 పర్యాయాలు స్పెషల్ ఇంటన్సివ్ రివిజన్ చేపట్టారని, కానీ ప్రస్తుతం చేపడుతున్న ఎస్ఐఆర్ మాత్రం భిన్నంగా ఉందన్నారు. ముఖ్యంగా నిరక్ష్యారాసులు, వయో వృద్ధులు, రైతులు, వలస కూలీలు తమ ఓటు హక్కును కొల్పోయే ప్రమాదం ఉందని, అలా జరగకుండా బీఎల్ఏలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎస్ఐఆర్ విధానంపై బీఎల్ఏలకు అవగాహనను కలిగి ఉండాలని, ప్రతి ఓటును కాపాడాల్సిన బాధ్యత మనదేనన్నారు. జగ్గారెడ్డి, ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, రాంమోహన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావద్, ఫుడ్ కార్పోరేషన్ చైర్మన్ ఫయీంలు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రేస్ అధ్యక్షురాలు నిర్మల, కాంగ్రేస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, రాంమోహన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావద్, ఫుడ్ కార్పోరేషన్ చైర్మన్ ఫయీం, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, పీసీసీ ఉపాధ్యాక్షుడు సంగమేశ్వర్, మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్‌లు ఎస్.కృష్ణారెడ్డి, ఎ.చిట్టిబాబు, పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జీ కాటా శ్రీనివాస్ గౌడ్, మార్కెట్‌కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ చైర్మన్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిగాచీ బాధితులకు పూర్తి పరిహారం చెల్లించాలి..

- **జూన్ 30న సంస్మరణ సభ నిర్వహిస్తాం : బీఆర్ఎస్**

**రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 23, (సిరి న్యూస్):**

సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర పేలుడు ఘటనకు ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పూర్తి నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. జూన్ 30న బాధితులతో కలిసి సంస్మరణ సభ నిర్వహించి మృతిచెందిన కార్మికులకు నివాళులర్పించనున్నట్లు ప్రకటించారు.సిగాచీ పరిశ్రమ పేలుడు ఘటనలో 54 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడిన వారిలో మరికొందరు చికిత్స పొందుతూ మృతి చెందారని, మరో ఎనిమిది మంది ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదని తెలిపారు. ఈ దుర్ఘటనకు ఏడాది పూర్తవుతున్నా బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.కోటి పరిహారం హామీ ఇప్పటికీ అమలు కాలేదని, ఇప్పటివరకు కేవలం రూ.25 లక్షలు మాత్రమే అందించారని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు రావాల్సిన పూర్తి నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని, వారం రోజుల్లోగా ఈ అంశంపై ప్రభుత్వం స్పందించకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించిన వారు, మంత్రి వివేక్ వెంకటస్వామి పరిహారం విషయంలో చెబుతున్న వివరాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు.మాజీ మంత్రి హరీశ్ రావు ఆదేశాల




మేరకు జూన్ 30న నిర్వహించే సంస్మరణ సభలో మృతిచెందిన కార్మికులకు ఘన నివాళులు అర్పించడంతో పాటు బాధిత కుటుంబాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఇస్నాపూర్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభం




**రామచంద్రాపురం, జూన్ 23, (సిరి న్యూస్):**

రామచంద్రాపురం మండలం వెలిమెల గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం విత్తన మేళాను పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పంటల అవసరాలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను పొందాలని సూచించారు. విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ తదితర ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కిసాన్ మేళా ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాణి, రోజా, సొసైటీ డైరెక్టర్లు లక్ష్మణ్ నాయక్, అంజి రెడ్డి పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో రైతులు హాజరై వివిధ రకాల విత్తనాలు, ఎరువులపై అవగాహన పొందారు. రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను వ్యవసాయ శాఖ అధికారులు అందించారు.

# మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్..!

- **ఎస్‌వీఎస్‌బీ అవతార్ అపార్ట్‌మెంట్‌లో సొంత నిధులతో బోరు ప్రారంభం**



**రామచంద్రాపురం, జూన్ 23, (సిరి న్యూస్ ):**

ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎస్‌వీఎస్‌బీ అవతార్ గేటెడ్ అపార్ట్‌మెంట్‌లో తాగునీటి సమస్యను గుర్తించిన ఆయన, ఇటీవల జరిగిన పర్యటనలో బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కేవలం రెండు రోజుల్లోనే సొంత నిధులతో బోరు వేయించి, మంగళవారం సాయంత్రం అపార్ట్‌మెంట్ వాసుల సమక్షంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ ప్రజలకు హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా వాటిని ఆచరణలో చూపించడమే తమ విధానమని అన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు అవసరమైన చోట సొంత నిధులతోనూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి, సొంత నిధులతో బోరు వేయించిన ఎమ్మెల్యే జీఎంఆర్‌కు అపార్ట్‌మెంట్ వాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పరమేష్ యాదవ్, సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణ్, స్థానిక నాయకులు, అపార్ట్‌మెంట్ నివాసితులు పాల్గొన్నారు.


# తూప్రాన్ లో రైతు విత్తన మేళా




**తూప్రాన్ జూన్ 23 సిరి న్యూస్**

తూప్రాన్ రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమం మంగళవారం విజయవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి తూప్రాన్ తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి డిప్యూటీ తాసిల్దార్ శ్రీకాంత్ కన్జూమర్ ఫోరం అధ్యక్షురాలు గాయత్రి ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ నర్సాపూర్ వ్యవసాయ సంచాలకురాలు సంధ్యారాణి వ్యవసాయ అధికారులు యాదగిరి గంగుమల్లు అభిలాష్ గౌడ్ లక్ష్మి మండలంలోని వరి విత్తన డీలర్ల యజమానులు మండలంలోని సర్పంచులు ఉప సర్పంచులు కౌన్సిలర్ లు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని విత్తన మేళాను విజయవంతం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ విత్తన మేళాలో ప్రధానంగా ప్రభుత్వం సూచించిన రకాల వరి విత్తనాలను సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.500 బోనస్ అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.బీపీటీ 5204 సాంబ మసూరిఆర్ ఎన్ ఆర్–15048 తెలంగాణ సోనాహెచ్ఎంటీ జై శ్రీరామ్ –962 వీటితో పాటు మరికొన్ని రకాలుపైన పేర్కొన్న విత్తనాలు ఈ నెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు మండల రైతు వేదిక ద్వారా రైతులకు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





## సౌండ్ తగ్గించండి బాస్..

వృత్తి రీత్యా కొందరు ఎక్కువ సేపు ఇయర్ ఫోన్స్ వాడటం అనివార్యమవుతుంది. అలాంటి వారు సౌండ్ తగ్గించుకోవడం ద్వారా ఈ సమస్యల నుంచి కాస్తంత గట్టెక్కొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. శబ్దాన్ని డెసిబెల్స్‌లో కొలుస్తారు. మన వినే శబ్దం 60 డెసిబెల్స్ కంటే తక్కువగా ఉండాలి. అలా ఉంటే మనం ఎక్కువ సేపు ఇయర్ ఫోన్స్ వినియోగించినా పెద్దగా ఇబ్బంది ఉండదు. సమస్య కూడా తీవ్రతరంగా మారదు. అలా కాకుండా సౌండ్‌ను 85 డెసిబెల్స్ న్నా ఎక్కువగా ఉంచితే మాత్రం వినికిడి లోపం వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అయితే మన ఫోన్‌లో శబ్ధం ఎన్ని డెసిబెల్స్‌లో వస్తుందో కొలవడం కష్టం. అందుకని ఎప్పుడూ కూడా శబ్దాన్ని ఫోన్‌లో ఇచ్చిన దాంట్లో సగం అంటే 50శాతం పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. దాంతో పాటుగా ఎంత వృత్తి, ఉద్యోగమే అయినా ప్రతి గంటలకు ఒక 10 నిమిషాలు అయినా చెవులకు రెస్ట్ ఇవ్వాలని నిపుణులు చెప్తున్నారు.

## ఇతరులు ఇయర్ ఫోన్స్ వాడొద్దు..


**చాలా మంది పక్కవారి ఇయర్ ఫోన్స్ తీసుకుని వాడేస్తుంటారు. కానీ అలా చేయడం చాలా ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. మన తోబుట్టువులవైనా ఒకరి ఇయర్ ఫోన్స్‌ను మరొకరు వాడటం వల్ల లేనిపోని ఇబ్బందులు వస్తాయని, ఇద్దరిలో ఏ ఒక్కరికైనా ఏ రకమైన ఇన్ఫెక్షన్ ఉన్నా.. అది రెండో వ్యక్తికి కూడా సోకుతుందని అంటున్నారు. ఇయర్ ఫోన్లు వాడే వారి చెవుల్లో బ్యాక్టీరియా 7 రెట్లు అధికంగా పెరుగుతుంది. మనం వాడే ఇయర్ ఫోన్స్‌పై కోట్ల రకాల బ్యాక్జీరియాలు ఉంటాయి. మరొకరి ఇయర్ ఫోన్స్ వాడామంటే.. వాటిపై ఉండే బ్యాక్టీరియా అదనంగా మన చెవుల్లోకి చేరి అనేక సమస్యలకు దారి తీస్తుంది.**

# గంటల తరబడి ఇయర్ ఫోన్స్ వాడేస్తున్నారా..

## అయితే ప్రమాదంలో పడ్డట్టే..

ఇయర్ ఫోన్స్ వాడే అలవాటు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఈ రోజుల్లో దాదాపు ప్రతి ఒక్కరికీ కూడా ఇయర్ ఫోన్స్ అనేవి మొబైల్ ఫోన్‌తో పాటు తమ శరీర అవయంగా మారిపోయాయి. వీటిని ప్రతి చోటకు క్యారీ చేస్తుంటారు. మ్యూజిక్, ఆన్‌లైన్ క్లాసులు, వర్క్ ఫ్రం హోమ్, స్ట్రెస్ రిలీఫ్ ఇలా ఏదో ఒక కారణంతో ఎప్పుడూ ఇయర్ ఫోన్స్‌ను చెవిలో పెట్టే ఉంచడం ఈరోజుల్లో షరామామూలైపోయింది. ప్రయాణాలు చేసే వారు అయితే ఆ ప్రయాణం అంతా కూడా ఇర్‌ఫోన్స్ పెట్టుకుని మ్యూజిక్ వింటూ సీనరీని ఎంజాయ్ చేస్తుంటారు. కానీ వీటి వినియోగంలో జాగ్రత్త పాటించాలని, నిర్లక్ష్యం చేస్తే తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇయర్ ఫోన్స్ ఎక్కువగా వాడితే వినికిడి సమస్యలు రావడమే కాకుండా శాశ్వతంగా వికిడి శక్తిని కోల్పోయే ప్రమాదం కూడా ఉందని నిపుణులు చెప్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.5 బిలియన్ మంది యువత అత్యధిక సౌండ్ పెట్టుకుని సంగీతం వింటుంటారు. పక్కనే ఉన్న వ్యక్తి కేకలు వేసినా వీరికి వినిపించదు. వీరు వీరి లోకంలో ఉంటారు. ఆ స్థాయి సౌండ్‌తో ఇయర్ ఫోన్స్‌ను వినియోగించడం వల్ల వినికి సంబంధిత సమస్యలు తప్పవని వైద్య నిపుణులు అంటున్నారు. ఇదే విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ( డబ్ల్యూహెచ్ఓ) కూడా ధృవీకరించింది. ప్రస్తుతం 35 సంవత్సరాల కంటే తక్కువ




వయసు ఉన్న వారు అధికంగా ఇయర్ ఫోన్‌లు వాడుతున్నారు. వారిలో 50 శాతం మంది వినికి సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ సమస్య రానున్న కాలంలో మరింత పెరిగే ప్రమాదం ఉందని డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిస్తోంది. కావున యువత అంతా కూడా ఇయర్ ఫోన్స్ వినియోగం విషయంలో కాస్తం జాగ్రత్తా ఉండాలని చెప్తున్నారు నిపుణులు.

**శాశ్వత చెవుడు రావొచ్చు..**

అధిక శబ్దింతో ఇయర్ ఫోన్స్ వినియోగిస్తే శాశ్వత చెవుడు కూడా రావొచ్చని వైద్యులు అంటున్నారు. సాధారణంగా మనం ఏదైనా ఒక శబ్దాన్ని వింటున్నాం అంటే అందుకు మన కర్ణబేరి కారణం. మన చెవుకు చేరే శబ్ద తరంగాలను బట్టి కర్ణబేరి వైబ్రేట్ అవుతుంది. తద్వారా చెవిలో ఉండే కండరాలు కదిలి మన మెదడుకు ఆ సౌండ్‌ను అర్థమయ్యేలా చేస్తాయి. అధిక శబ్దంతో సంగీతం వినడం ద్వారా కర్ణబేరిపై పనిభారం పెరుగుతుంది. కర్ణబేరి అతి వేగంగా, బలంగా వైబ్రేట్ అవుతుంది. ఆ సమయంలో చెవిలోని కండరాలను కాపాడుతూ ఉండూ చిన్నపాటి హెయిర్ పార్టికల్స్.. కొంతకాలానికి ఆ హెవీ ఫ్రీక్వెన్సీ వల్ల బలహీనపడతాయి. కొంతకాలానికి అవి పూర్తిగా నిర్వీర్యమవుతాయి. అవి రీజనరేట్ కావు. దాంతో శాశ్వత చెవుడు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరూ కూడా ఇయర్ ఫోన్స్ వాడే సమయంలో శబ్దాన్ని కాస్తంత తక్కువగా పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ఇన్ఫెక్షన్లు తప్పవు..**

అంతేకాకుండా గంటల తరబడి ఇయర్ ఫోన్స్ పెట్టుకోవడం వల్ల చెవిలో గాలి ఆడదు. దాంతో చెవిలో ఫంగస్, బ్యాక్టీరియాలు పేరుకుపోతాయి. వీటి వల్ల చెవిలో దురద, నొప్పి, చీము కారడం, చెవి పోటు, చెవిలో గుయ్ మనే శబ్ధం వచ్చినట్లు ఉండటం వంటి అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. కొన్ని కొన్ని సందర్భాల్లో కర్ణబేరి పొరలో బ్యాక్టీరియా పేరుకుపోవడం వల్ల దానిని క్లీన్ చేయడం కోసం మన శరీరం ఒక విధమైన ద్రవాన్ని విడుదల చేస్తుంది. అది అధికమైనప్పుడు కూడా చెవి సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటి బారిన పడకుండా ఉండాలంటే ఇయర్ ఫోన్, ఇయర్ బడ్, బ్లూటూత్ వంటి వాటిని ఎక్కువ సమయం వినియోగించడం మానుకోవాలని సూచిస్తున్నారు.

**హెడ్ ఫోన్స్ వినియోగం మంచిది..**

చాలా మంది రకం ఏదైనా ఇయర్ ఫోన్స్ అనే అంటారు. కానీ ఇయర్ ఫోన్స్ వేరు, హెడ్ ఫోన్స్ వేరు. చెవిలో ఇమిడిపోయేలా ఉండే వాటిని ఇయర్ ఫోన్స్ అంటారు. చెవిపై పెట్టే వాటిని హెడ్ ఫోన్స్ అంటాం. ఇయర్ ఫోన్స్ వినియోగం వల్ల అనేక సమస్యలు వస్తాయి. శబ్దం నేరుగా చెవిలోకి వెళ్లి కర్ణబేరిపై అధిక భారం మోపుతాయి. చెవిలోకి గాలి వెళ్లకుండా చేసి ఇన్‌ఫెక్షన్లు వచ్చేలా చేస్తాయి. కానీ హెడ్ ఫోన్స్ వినియోగిస్తే ఈ సమస్యలు చాలా వరకు రావని వైద్యులు చెప్తున్నారు. కానీ హెడ్ ఫోన్స్‌లో కూడా శబ్ధాన్ని తగ్గించే పెట్టుకోవాలని సూచిస్తున్నారు. హెడ్ ఫోనస్ వినియోగించే సమయంలో శబ్ధం నేరుగా మన చెవిలోకి వెళ్లదు. ఓపెన్ ఏరియా నుంచి చెవిలోకి ప్రవేశిస్తుంది. దాని వల్ల కర్ణబేరిపై భారం పెద్దగా పడదు. దాంతో పాటుగా హెడ్ ఫోన్స్ వినియోగించేటప్పుడు కాసేపటికి ఒక్కసారైన కదిలిస్తుంటాం.. ఆ సమయంలో చెవికి గాలి తగిలి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.



# మొండి పిల్లలను ఇలా హ్యాండిల్ చేయండి..



చిన్న పిల్లను పెంచడం ఆషామాషీ విషయం కాదు. పిల్లల్లో కొందరు పెరిగే కొద్దీ మొండిగా తయారవుతుంటారు. వాళ్లు కోరుకున్నది కావాల్సిందే అని పట్టబట్టి కూర్చుకుంటారు. పెద్దోళ్లు ఎంత వారిస్తున్నా వినకుండా ఏడుస్తూ.. వాళ్లకి కావాల్సిందేనని డిమాండ్ చేశారు. పిల్లలు పెరిగేకొద్దీ వారు ఇంటి బయట ప్రపంచాన్ని అన్వేషించడం ప్రారంభిస్తారు. పదేళ్ల వయసు వచ్చిన తర్వాత వీరి మొండితనం మరింత పెరుగుతుంది. ఈ క్రమంలో వారు కొత్తకొత్త విషయాలు తెలుసుకుంటుంటారు. వారి మనసు బయట స్నేహితులతో ఎక్కువగా ఉంటుంది. తాము చెప్పిందే అందరూ వినాలన్నట్లు ప్రవిర్తిస్తుంటారు. బయట ప్రపంచానికకి మరింత ఆకర్షితులై తల్లిదండ్రులు మాట వినకుండా వారు మొండిగా తయారవుతారు. ఇలాంటి సమయంలో వీరిని ఎలా హ్యాండిల్ చేయాలో తెలియక చాలా మంది తల్లిదండ్రులు సతమవుతుంటారు. అయితే అలా మొండిగా తయారైన పిల్లలను ఎలా హ్యాండిల్ చేయడాలో కొన్ని టిప్స్ చూడండి..

ప్రొత్సాహం వద్దు: పిల్లలు సాధారణంగా ఏదో ఒకటి డిమాండ్ చేస్తూనే ఉంటారు. అది ఇప్పించని సమయంలో వారు మారాం చేస్తారు. వారు అడిగిన ప్రతి ఒక్కదానికి మీరు ఒప్పుకోవాలని అతను భావిస్తాడు. మీరు అలా చేయకపోతే ఏడుపు ప్రారంభిస్తారు. దీంతో నలుగురూ చూస్తున్నారయినా మీరు దానిని ఇప్పిస్తారు. కానీ అలా మీరు కరగకుండా ఉండాలి. కోపం కూడా తెచ్చుకోకూడదు. పట్టించుకోకుండా ఉండండి. వారు ఏడవగానే మీరు ఓదార్చడానికి వెళితే వారు మరింత మొండిగా తయారవుతారు. ఆ ట్రిక్ బాగా పనిచేస్తుందని అనుకుని ఇక ప్రతి విషయంలో ఇలానే ఏడవం ప్రారంభిస్తారు.

**శిక్షించొద్దు:** ప్రతి తప్పుకు పిల్లలను శిక్షించవద్దు. బదులుగా, వారికి మాట్లాడే అవకాశం ఇవ్వండి. ఇది పిల్లల కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. తద్వారా తనను తాను మరింత మెరుగ్గా వ్యక్తీకరించగలుగుతారు. ఉదాహరణకు, పిల్లవాడు దేనికైనా అనుమతి అడుగుతున్నట్లయితే, తన మాటలతో తల్లిని ఒప్పించమని చెప్పండి. అటువంటి పరిస్థితిలో, పిల్లలు తమను తాము మరిన్ని విధాలుగా వ్యక్తీకరించడం నేర్చుకుంటారు.

**స్వేచ్ఛ కూడా అవసరం:** ప్రతి విషయంలోనూ బిడ్డకు నో చెప్పడం కరెక్ట్ కాదు. ఇది వారి మనస్సులో తల్లిదండ్రుల పట్ల ప్రతికూల ఆలోచనలు పెంచుతాయి. అటువంటి పరిస్థితిలో కొంత స్వేచ్ఛ ఇవ్వడం కూడా అవసరం. స్నేహితులతో ఆడుకోవడం, మాట్లాడటం, తిరగడానికి అనుమతి ఇవ్వడం వంటివి. అయితే అదే సమయంలో పిల్లలపై ఓ కన్నేసి ఉంచడం కూడా చాలా ముఖ్యం. లేకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

**అన్నింటికీ తిట్టొద్దు:** పిల్లవాడు వచ్చి తన తప్పును అంగీకరిస్తే తిట్టడం, కొట్టడం వంటివి చేయొద్దు. అతన్ని తిట్టడానికి బదులు, ప్రశాంతంగా వినండి. ఆ సమయంలో వారికి ఓదార్పు మాత్రమే ఇవండి. తప్పు చేసినప్పుడు ఒప్పుకోవాలని వారికి వివరించండి. అలా చేయడం ద్వారా పల్లల సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరగడంతో పాటు అబద్ధాలు చెప్పే అలవాటు కాకుండా ఉంటుంది.

**వాదన వద్దు:** పిల్లలు వాదిస్తున్నప్పుడు మీరు తిరిగి వాదించకండి. అలా చేస్తే వాదించడం మంచి పద్దతేమో అని ప్రతి చోటా అదే పని చేస్తాడు. కాబట్టి పిల్లల మాటల్లో కొన్నింటికే స్పందించండి. ఇది పిల్లవాడు నేర్చుకోవడానికి, అర్థం చేసుకోవడానికి అవకాశం ఇస్తుంది.

ఏడుపుకు లొంగకండి : పిల్లవాడు ఏడుస్తూ, అరుస్తూ, ప్రతి విషయంలో మీతో వాదిస్తుంటే అతడిని ఎక్కువగా పట్టించుకోకండి. లేకుంటే అలాంటి డ్రామాలు ఎక్కువైపోతాయి. నిరంతరం పిల్లలను మెరుగుపరచడానికి ప్రయత్నించండి. ఈ వయసులోనే పిల్లల్ని సరైన దారిలో పెట్టాలి. అతనికి పద్ధతులను నేర్పించాలి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.